## పేరు పెట్టకముందే.. పైలోకాలకు..

- పులిగడ్డ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి
- మృతుల్లో 20 రోజుల పసికందుతో సహా ఐదేళ్ల చిన్నారి కూడా
- మోపిదేవి ఆలయంలో నామకరణం కోసం వెళుతూ...
- ఒకే కుటుంబంలో నలుగురు మరణించడంతో విషాద ఛాయలు

తెనాలిలో పెను విషాదం

7


# పన్ను వసూలులో.. మున్సిపల్టీలు

- పురాల్లో పన్ను వసూలు 45.40 శాతమే
- లక్ష్యాల సాధనలో వెనుకంజ
- కలసి రాని 50 శాతం వడ్డీ రాయితీ
- పన్ను వసూలు లక్ష్యం రూ. 643.67 కోట్లు
- వసూలు చేసింది రూ. 292.24 కోట్లు
- ఇంకా బకాయిలు రూ. 351.43 కోట్లు
- రాష్ట్ర స్థాయిలో వినుకొండ ద్వితీయ.. అద్దంకి తృతీయ స్థానం
- అట్టడుగున చిలకలూరిపేట మునిసిపాల్టీ



**ఆర్థిక సంవత్సరం ముగిసింది. పన్నుల వసూలుకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో మునిసిపాలిటీలు వెనుక బడ్డాయి. ప్రభుత్వం 50 శాతం వడ్డీ మాఫీ అవకాశం కల్పించినా కలసి రాలేదు. పన్ను చెల్లించేందుకు పురాల పౌరులు ముందుకు రాలేదు. అయితే గత ఏడాది కంటే 2.23 శాతం పన్ను వసూలు పెరిగింది. గత ఏడాది 43.17 శాతం పన్ను వసూలు కాగా ఈ ఏడాది 45.40 శాతం పన్ను వసూలైంది. ఆస్తి, తాగునీటి పన్ను వసూలు లక్ష్యం 643.67 కోట్లు కాగా, 292.24 కోట్లు పన్ను వసూలైంది. ఇంకా ఆస్తి, తాగునీటి పన్ను బకాయిలు భారీగా పేరుకుపోగా, రూ 351.43 కోట్లు పన్నులు వసూలు కావాల్సి ఉంది. పన్ను వసూలులో రాష్ట్ర స్థాయిలో వినుకొండ ద్వితీయ, అద్దంకి తృతీయ స్థానంలో నిలిచాయి. చిలకలూరిపేట మునిసిపాల్టీ అట్టడుగున ఉంది.**

**మునిసిపాలిటీల వారీగా ఆస్తి పన్ను వసూలు ఇలా..**

| మునిసిపాలిటీ | లక్ష్యం కోట్లలో | వసూలైన పన్ను కోట్లలో | శాతం |
|---|---|---|---|
| **పల్నాడు జిల్లా :** | | | |
| నరసరావుపేట | 20.59 | 11.20 | 54.42 |
| చిలకలూరిపేట | 22.40 | 8.86 | 39.54 |
| వినుకొండ | 6.30 | 5.18 | 82.22 |
| సత్తెనపల్లి | 8.75 | 5.15 | 58.83 |
| మాచర్ల | 7.63 | 4.05 | 53.15 |
| పిడుగురాళ్ళ | 6.97 | 4.82 | 69.11 |
| దాచేపల్లి | 2.49 | 1.61 | 64.72 |
| గురజాల | 1.90 | 1.25 | 65.49 |
| **గుంటూరు జిల్లా :** | | | |
| గుంటూరు | 320.52 | 134.50 | 41.96 |
| తెనాలి | 30.07 | 18.20 | 60.54 |
| మంగళగిరి, తాడేపల్లి | 48.98 | 37.56 | 76.68 |
| పొన్నూరు | 7.40 | 4.98 | 67.30 |
| **బాపట్ల జిల్లా :** | | | |
| రేపల్లె | 6.57 | 4.85 | 73.85 |
| బాపట్ల | 12.90 | 6.29 | 48.76 |
| చీరాల | 13.69 | 9.04 | 66.08 |
| అద్దంకి | 5.12 | 4.09 | 80.01 |

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మునిసిపాల్టీల్లో రూ. 522.28 కోట్లు ఆస్తి పన్ను వసూలు చేయాల్సి ఉండగా రూ 261.09 కోట్లు వసూలు చేశారు. నీటి పన్ను రూ 121.39 కోట్లు కాగా రూ 31.15 కోట్లు వసూలైంది. ఆస్తి పన్ను రూ 261.19 కోట్లు, తాగునీటి పన్ను రూ 90.24 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఆస్తి పన్ను 49.99 శాతం, నీటి పన్ను 25.66 శాతం వసూలైంది. పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట మునిసిపాల్టీలలో ఆస్తి పన్ను 40 శాతం లోపే ఉంది. పల్నాడు జిల్లాకు సంబంధించి మునిసిపాల్టీలలో రూ 77.03 కోట్లు పన్ను వసూలు చేయాల్సి ఉండగా రూ. 42.07 కోట్లు వసూలైంది. 54.61 శాతం ఆస్తి పన్ను వసూలు చేశారు. తాగునీటి పన్ను రూ . 22.37 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. నీటి పన్ను రూ. 7.07 కోట్లు వసూలు చేయగా వసూలు శాతం 31.60 గా ఉంది. వినుకొండ మునిసిపాల్టీ 82.22 శాతం ఆస్తిపన్ను వసూలు చేసి రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి బకాయిలు భారీగా పేరుకుపోయాయి. వడ్డీ మాఫీ చేసినా బకాయిదారులు స్పందించ లేదు.

- గుంటూరు కార్పోరేషన్‌తో సహా జిల్లాలో రూ. 406.97 కోట్లు ఆస్తి పన్ను, రూ 91.83 కోట్లు నీటి పన్ను వసూలు లక్ష్యం కాగా ఆస్తి పన్ను రూ. 194.76 కోట్లు, నీటి పన్ను రూ. 21.77 కోట్లు వసూలు చేశారు. ఆస్తి పన్ను 47.86 శాతం, నీటి పన్ను 23.70 శాతం వసూలైంది. ఈ జిల్లాలో కేంద్ర ప్రభుత్వం కార్యాలయాలకు సంబంధించి దాదాపు 10 కోట్లు పన్ను బకాయి పేరుకుపోయింది. వీటి నుంచి పన్ను వసూలు కాలేదని అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్యాలయాల పన్ను బకాయి రూ. 29 కోట్లకు పైగా ఉండగా నామమాత్రంగానే పన్ను వసూలైంది. గుంటూరు కార్పోరేషన్ పన్ను వసూలులో అలసత్వం వలన 41.96 శాతమే పన్ను వసూలైంది.
- బాపట్ల జిల్లాలో మునిసిపాల్టీలలో ఆస్తి పన్ను రూ 38.28 కోట్లు లక్ష్యం కాగా రూ 24.26 కోట్లు వసూలు చేశారు. నీటి పన్ను 7.18 కోట్లకు రూ 2.31 కోట్లు వసూలైంది. ఆస్తి పన్ను 63.39 శాతం, నీటి పన్ను 32.20 శాతంగా నమోదైంది. బాపట్ల మున్సిపాల్టీ మునిసిపాల్టీలో 48.76 శాతం మాత్రమే పన్ను వసూలు చేశారు. అద్దంకి మునిసిపాల్టీ 80.01 శాతం పన్ను వసూలు చేసి రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది.



ఈద్గాలో వద్ద జరిగిన రంజాన్ ప్రార్థనలకు హాజరైన ముస్లింలు

నరసరావుపేటలోని ఈద్గా వద్ద జరిగిన రంజాన్ ప్రార్థనలకు హాజరైన ముస్లింలు

# ఘనంగా రంజాన్

## ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు



వినుకొండ ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



పిడుగురాళ్లలో ఈద్గాలో జరిపిన ప్రత్యేక ప్రార్థనలలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



మాచర్లలో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలలో ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

నరసరావుపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) పవిత్ర రంజాన్ పండుగను సోమవారం జిల్లా అంతటా ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేసిన పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా నూతన వస్త్రాలు ధరించి సంతోషంగా ఒకరినొకరు పలకరించుకుంటూ, అలింగనం చేసుకుంటూ సందడి చేశారు. అన్ని ఈద్గా మైదానాల వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పోలీసు శాఖ ఈద్గాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసింది. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. బందోబస్తు ఏర్పాట్లపై ఎస్పీ కంచి శ్రీనివాసరావు పోలీసు అధికారులతో సమీక్షించారు. వినుకొండలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, పిడుగురాళ్ళలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మాచర్లలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి రంజాన్ ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

నరసరావుపేటలోని ప్రకాష్ నగర్ ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణ నలుమూలల నుంచి ముస్లింలు ప్రార్థనలకు వేలాదిగా తరలి వచ్చారు. ప్రకాష్‌నగర్ వీధులు ముస్లింలతో కిటకిటలాడాయి. సాహి ఇమామ్ రజా ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. శాసన సభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ శాసన సభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రార్థనలకు హాజరై రంజాన్ శుభాకాంక్షలు తెలియ జేశారు. అలాగే మండలంలోని పెదతురకపాలెం, చినతురకపాలెం, ములకలూరు తదితర గ్రామాల్లో రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రంజాన్ ప్రత్యే క ప్రార్థనలు నిర్వహించారు.



# పల్నాడు రోడ్లకు మహర్దశ

- బైపాస్ విస్తరణకు 54.9 కోట్లు
- మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం
- మాచర్ల, రెంటచింతల, గురజాల పట్టణాలకు అదనపు సొబగులు

మాచర్లటౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మాచర్ల - నడికూడి ఎన్‌హెచ్ 167ఏడీ బైపాస్ విస్తరణలో భాగంగా మాచర్ల - రెంటచింతల - గురజాల పట్టణాలకు అంతర్గత బైపాస్ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం రూ. 54.09 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో మాచర్ల పట్టణంలో రింగురోడ్డు నుంచి అంబేద్కర్ సెంటర్, నెహ్రూనగర్, శివప్రియ నగర్ వరకు 6 కి.మీ.ల మేర అంతర్గత బైపాస్ రహదారి విస్తరణ చేపట్టనున్నారు. సెంటర్ డివైడర్, హైమాస్క్ లైటింగ్, డివైడర్‌కు ఇరువైపులా 20 అడుగులు రోడ్డు విస్తరణ, రోడ్డుకిరువైపులా సైడ్ డ్రెయిన్స్ డ్రెయిన్స్‌కు రెయిలింగ్స్, వాటర్ లైన్స్, విద్యుత్‌లైన్లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే రెంటచింతలలో గోలి వాగు నుంచి గురజాల రోడ్డులోని హెచ్‌పీ గ్యాస్ బంకు వరకు 5 కిమీ మేర రోడ్డు విస్తరణ చేపట్టనున్నారు. గురజాలలో గాడిదెల వాగు నుంచి వాగ్దేవి కళాశాల వరకు 6 కిమీ మేర రోడ్డు విస్తరణ జరగనుంది. మాచర్ల - రెంటచింతల - గురజాల పట్టణాల రూపురేఖలు మారనున్నాయి. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రహదారులకు అత్యంత ప్రాధాన్యతనివ్వడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావులు చూపిన చొరవకు కేంద్రం నుంచి ఆశాజనకంగా నిధుల వరద వస్తుండడం విశేషం. యేళ్ల తరబడి కనీస మరమ్మతులకు నోచుకోని రహదారులను నేషనల్ హైవేస్‌గా మార్చి నిధుల మంజూరు చేయించడంతో పల్నాడు రోడ్లకు మహర్దశ పట్టింది.

నడికూడి వద్ద కల్లాలపై పట్టలు కప్పుతున్న రైతులు



## చిరు జల్లులతో మిర్చి రైతుల కలవరపాటు


దాచేపల్లి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు రాలటంతో కల్లాల్లో మిరపకాయలు ఆరబోసిన రైతులు ఆందోళన చెందారు. సోమవారం వేకువ జామునే చిరు జల్లులు రాలటంతో మిర్చి రైతులు పట్టలతో ఊరి చివర కల్లాల్లో ఆరబోసిన మిరపకాయలపై పట్టలు కప్పారు. ఇప్పటికే ధరలు పడిపోవటం ఆపై తేలికపాటి చినుకులు రాలటంతో రైతులను ఆందోళనకు గురిచేసింది. ప్రధానంగా దాచేపల్లి, కేసానుపల్లి, నడికూడి, తక్కెళ్ళపాడు, మాదినపాడు, పెదగార్లపాడు, ముత్యాలంపాడు, తంగెడ గ్రామాల్లో రైతులు అవస్థలు పడ్డారు.

# రాధాగోవిందులకు మహాపుష్పాభిషేకం, తెప్పోత్సవం



ఆలయ ప్రాంగణంలోని పుష్కరిణిలో తెప్పోత్సవం

నరసరావుపేట టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : రాధాగోవింద చంద్ర మందిరంలో దేవతామూర్తులకు 1008 కిలోల పుష్పాలతో మహా పుష్పాభిషేకం నిర్వహించారు. పట్టణంలోని బరంపేటలో ఉన్న ఇస్కాన్ రాధాగోవింద చంద్ర మందిరంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది, ఆలయ 13 వార్షికోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించామని నిర్వాహకులు సోమవారం తెలిపారు.. అదేవిధంగా ఉత్సవ మూర్తులకు మహా శంఖాభిషేకం నిర్వహించారు. శ్రీవారి పుష్కరిణిలో తెప్పోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం ప్రసాద వితరణ చేశారు. ఆయా కార్యక్రమాలలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు.



సాగర్ కుడి కాలువలో నీటి సరఫరా

# అన్నదాతలకు ఊరట

**సాగర్ రైతులకు నీటిపారుదల శాఖ అధికారులు ఊరటనిచ్చారు. సోమవారం నుంచి నీటి సరఫరా నిలిపి వేయాల్సి ఉండగా, రైతుల అవసరాలు దృష్టిలో ఉంచుకొని నీటి సరఫరా కొనసాగించాలని నిర్ణయించారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన నాడు బారాబందీ.. నేడు వారబందీ కథనం అధికారుల్లో చలనం తీసుకొచ్చింది. ఇదే అంశాన్ని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అసెంబ్లీలో ప్రస్తావించి, నీటి సరఫరా కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రభుత్వం స్పందించి నీటి విడుదల కొనసాగించాలని అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. 4 వేల క్యూసెక్కులను కుడి కాలువకు విడుదల చేస్తున్నారు. సాగునీటి అవసరం ఉన్న కాలువలకు మాత్రమే నీటి సరఫరా చేసే విధంగా జలవనరుల శాఖ ప్రణాళికను రూపొందించింది. నీటి సరఫరా నిలిపివేస్తే వరి రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. నీటి సరఫరాపై తీసుకున్న ప్రభుత్వ నిర్ణయం అన్నదాతలకు ఊరట నిచ్చింది.**

- సాగర్ కుడి కాలువకు నీటి సరఫరా కొనసాగింపు
- మోటర్లకూ అనుమతి
- తాగు నీటి చెరువులు నింపుకుంటే మేలు
- ఆంధ్రజ్యోతికి స్పందన

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సాగర్ ఆయకట్టు పరిధిలోని జిల్లాలో 52,818 ఎకరాల్లో రెండో పంట వరి సాగు చేశారు. దాదాపు 1.02 లక్షల ఎకరాల్లో మిరపసాగు ఉంది. కాగా సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాల పరిధిలో ఎక్కువగా వరి సాగు ఉంది. పంట వివిధ దశల్లో ఉంది. నకరికల్లు, రాజుపాలెం మండలాల్లో కోతల దశలో ఉంది. మిగతా ప్రాంతాల్లో పంట పొట్ట దశలో ఉంది. కొన్ని ప్రాంతాల్లో గింజ పాలుపోసుకునే దశలో ఉంది. కంకి వెళుతున్న సమయంలో నీటి సరఫరా నిలిచిపోతుండటంతో గింజ తాలుగా మారుతుందని రైతులు ఆందోళన చెందారు. సాగు నీటిని కొనసాగిస్తుండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 15 వరకు నీరు ఇస్తేనే పంట చేతికి వస్తుందని రైతులు చెబుతున్నారు. నీటి సరఫరాతో మిరప పంటకు ఒక తడికి నీరు అవసరం తీరనున్నది.

### ఆయిల్ ఇంజన్ల ఏర్పాటుకు అనుమతి

కాలువలకు నీటి సరఫరాను తగ్గించడంతో కాలువల చివరి భూములకు నీరు అందడం లేదు. కొన్ని ప్రాంతాల్లో తూములకు నీరు అందడం లేదు. ఈ నేపథ్యంలో నీరు అవసరం ఉన్న రైతులు ఆయిల్ ఇంజన్లు వినియోగించుకోవాల్సి వస్తుంది. రైతులు నీటి కోసం ఇంజన్లు ఏర్పాటు చేసుకోవచ్చని జల వనరుల శాఖ ఎస్సీ కృష్ణమోహన్ తెలిపారు. నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, వృధా చేయవద్దని సూచించారు.

### సాగర్‌లో 149.28 టీఎంసీల నీరు

సాగర్ జలాశయంలో 590 అడుగుల పూర్తి స్థాయి నీటి మట్టం కాగా సోమవారం 520 అడుగుల నీటి మట్టం నమోదైంది. 312.05 టీఎంసీల నీటి సామర్థ్యం కాగా 149.28 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సాగర్ డెడ్ స్టోరేజి నీటి మట్టం 498 అడుగులు అంటే ఇంకా 22 అడుగు మేర నీటిని వినియోగించుకునే అవకాశం ఉంది. డెడ్ స్టోరేజీ నీటి సామర్థ్యం 112.18 టీఎంసీలు కాగా ప్రస్తుత నిల్వ ప్రకారం ఇంకా 37.1 టీఎంసీల నీటిని వినియోగించుకునే అవకాశం ఉంది. అయితే వర్షాలు కురిసి డ్యాంకు వరద వచ్చే వరకు ఉన్న నీటిని వేసవి తదుపరి తాగునీటి అవసరాలకు పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. వర్షాలు కురవడంలో ఏ మాత్రం జాప్యం జరిగినా కుడి కాలువ పరిధిలోని నాలుగు జిల్లాల ప్రజలు తాగు నీటి ఎద్దడి ఎదుర్కొనే ప్రమాదం ఉంది. సాగుకు విడుదల చేస్తున్న నీటిని రైతులు పొదుపుగా వినియోగించుకుంటేనే తాగు నీటి గండం నుంచి గట్టెక్కే అవకాశం ఉంటుందనేది అంచనా.



నాడు బారాబందీ నేడు వారబందీ

గత నెల 19వ తేదీన ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురించిన కథనం

### తాగు నీటి చెరువులు నింపుకుంటే మేలు

కాలువకు నీటి సరఫరా జరుగుతున్న నేపథ్యంలో ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ అధికారులు, స్థానిక సంస్థల పాలక పక్షాలు తాగు నీటి చెరువులను నింపే విషయంలో అప్రమత్తం కావాలి. చాలా చెరువుల్లో నీటి నిల్వ 50 శాతం లోపే ఉంది. కాలువ నీటిపైనే ఆరు మునిసిపాల్టీల చెరువులు ఆధారపడి ఉన్నాయి. వీటిలో 75 శాతం వరకు నీటి నిల్వలు ఉన్నట్లు అధికారుల నివేదికలు తెలియజేస్తున్నాయి. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలోని గ్రామాల్లో నీటి సరఫరాకు వినియోగించే చెరువులు దాదాపు 394 ఉన్నాయి. ఈ చెరువులు నిండాలంటే సాగర్ కాలువ నీరే ఆధారం. అధికారులు తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# సీఎం సొంతూరులో సర్వతోముఖాభివృద్ధి



# ఇది.. నారా వారి ఊరు

- జడ్పీ హైస్కూలులో ఐఐటీ మద్రాసు పాఠాలు
- యువతకు నైపుణ్య శిక్షణ
- ప్రతి ఇంటిపైనా సోలార్ ప్యానెల్
- గడప గడపకూ తాగునీరు, వంట గ్యాస్

(తిరుపతి - ఆంధ్రజ్యోతి)

శేషాచల పర్వతాల పాద భాగంలో పచ్చటి పంటపొలాలు, అడవుల నడుమ ఆవిర్భవించిన నారావారిపల్లె ఒక చిన్న పల్లెటూరు..! తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం కందులవారిపల్లె పంచాయతీలో ఓ మజరా గ్రామం. చంద్రబాబు గతంలో 14 ఏళ్ల పాటు సీఎంగా ఉన్న సమయంలో టీటీడీ కల్యాణ మండపం, కమ్యూనిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయించారు. గతేడాది నాలుగోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టాక నారావారిపల్లె అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించడంతో తిరుపతి కలెక్టర్ రంగంలోకి దిగారు. ఇంటింటి సర్వే చేపట్టి కుటుంబాల సమగ్ర వివరాలు సేకరించి ఆ సమాచారం సీఎం ముందుంచారు. ఆయన సూచనలతో స్వర్ణ నారావారిపల్లె పేరిట సమగ్ర ప్రణాళిక రూపుదిద్దుకుంది. అందులో భాగంగా చంద్రగిరి మండలం కందులవారిపల్లె, ఎ.రంగంపేట, చిన్నరామాపురం పంచాయతీల పరిధిలోని 31 మజరా గ్రామాలను క్లస్టర్‌గా ఏర్పాటు చేశారు. క్లస్టర్ పరిధిలో 2,007 ఇళ్లలో.. 2,160 కుటుంబాలకు చెందిన 5,960 మంది జనాభా ఉన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు కుటుంబాల అవసరాలు తీర్చేందుకూ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. ఈ 2,160 కుటుంబాల్లో 1,830 కుటుంబాలకు సొంత ఇళ్లున్నాయి. 286 కుటుంబాలకు లేవని గుర్తించగా నిబంధనల రీత్యా అర్హత కలిగిన 242 కుటుంబాలకు పీఎంఏవై కింద పక్కా గృహాలు మంజూరు చేయనున్నారు. వచ్చే ఏడాది మార్చిలోగా పక్కా ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి అప్పగిస్తారు. వ్యక్తిగత మరుగుదొడ్ల సదుపాయం లేని 35 కుటుంబాలకు కొద్ది రోజుల్లో వాటిని నిర్మించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. క్లస్టర్ పరిధిలో 1,202 మందికి వివిధ రకాల పెన్షన్లు అందుతున్నాయి. 137 మంది అర్హులకు మంజూరు కాలేదని గుర్తించారు. 97 మందికి గత నెలలోనే పెన్షన్లు మంజూరు చేశారు. మిగిలిన వారికీ త్వరలో ఇచ్చే ఏర్పాట్లు పూర్తయ్యాయి. క్లస్టర్ పరిధిలో 87 కుటుంబాలకు తాగునీటి కొళాయి కనెక్షన్లు లేవని సర్వేలో గుర్తించారు. వాటిలో ఇప్పటికే 20 కుటుంబాలకు కనెక్షన్లు ఇవ్వగా.. మిగిలిన వారికి సెప్టెంబరులోపు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే 286 కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్లు లేవని తేలగా వారందరికీ వంట గ్యాస్ కనెక్షన్లు ఇచ్చేశారు.

## యువతకు ఉపాధి కోసం శిక్షణ







ఇంటింటి సర్వేలో భాగంగా యువత ఏ రంగంలో శిక్షణ కావాలని కోరుకుంటున్నారో గుర్తించి.. వారికి శిక్షణ కల్పిస్తున్నారు. దానికోసం నారావారిపల్లిలో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఈ గ్రామాల పరిధిలోని 35 మంది మహిళలకు జ్యూట్ బ్యాగ్, ఎంబ్రాయిడరీలలో శిక్షణ ఇచ్చారు. తిరుపతికి చెందిన నారీ ఎన్‌జీవోతో ఒప్పందం కుదిర్చారు. జూడియో సంస్థ మెటీరియల్ ఇస్తే మహిళలు దుస్తులు, కవర్లు కుట్టిచ్చేలా ఒప్పందం కుదిరింది. మరో 33 మంది యువతీయువకులకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. 449 మంది సభ్యులున్న 45 మహిళా సంఘాలకు గత మూడు నెలల్లోనే రూ.6.50 కోట్ల రుణాలు మంజూరు చేశారు. ఆ రుణాల ద్వారా 15 మంది మహిళలకు ఎలక్ట్రిక్ ఆటోలు అందజేశారు. వాటికి అవసరమైన రీఛార్జింగ్ స్టేషన్ కూడా నారావారిపల్లెలో ఏర్పాటు చేస్తున్నారు. క్లస్టర్ పరిధిలోని 7 దుకాణాలకు ఈజీమార్ట్‌తో ఒప్పందం కుదిర్చారు. దుకాణదారులు సరుకుల కోసం తిరుపతికి రాకుండా ఈజీమార్ట్ ద్వారా సరుకులు నేరుగా దుకాణాలకు చేరుతున్నాయి.



స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ ద్వారా శిక్షణ పొందుతున్న మహిళలు

### ప్రతి ఎకరం బిందు సేద్యం పరిధిలోకి..

300 మంది రైతులు 1,104 ఎకరాలు సాగు చేస్తున్నారు. అందులో అత్యధికంగా మామిడి పంట ఉంది. ఈ మొత్తం వ్యవసాయ భూమిని డ్రిప్ ఇరిగేషన్ పరిధిలోకి తేవాలని సీఎం ఆదేశించారు. ఈ 3నెలల్లోనే 21 మందికి చెందిన 43.5 ఎకరాలకు డ్రిప్ సదుపాయం కల్పించారు. పంటలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించే ఉద్దేశంతో ఫార్మర్స్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేశారు. ఇప్పటికే అందులో 250 మంది రైతులు చేరారు. వీరి ఉత్పత్తుల కోసం ఇప్పటి వరకూ దేశంలో పెద్దగా అమలులో లేని ట్రేసబిలిటీ క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. పాడి ఆవుల రక్షణ కోసం గోకులాల పేరిట రూ.2.02 కోట్ల నిధులతో 103 షెడ్లు మంజూరు కాగా.. 87 షెడ్ల నిర్మాణం పూర్తయింది. మిగిలినవి కొద్ది రోజుల్లో పూర్తి కానున్నాయి. నారావారిపల్లి క్లస్టర్‌లో రోజువారీ పాల ఉత్పత్తి 5,800 లీటర్లు.

### రూ. 155 కోట్లతో అభివృద్ధి పనులు

నారావారిపల్లె క్లస్టర్‌లో రూ.155 కోట్లతో అభివృద్ధి పనులు ప్రతిపాదించగా వాటిలో కొన్ని మంజూరయ్యాయి. ఎ.రంగంపేట నుంచి నారావారిపల్లె మీదుగా భీమవరం ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతులకు రూ.16 కోట్లు మంజూరయ్యాయి. గ్రామాల్లో రూ.3.14 కోట్లతో 16 సీసీ రోడ్లు మంజూరయ్యాయి. రూ.6.73 కోట్లతో అవసరమైన చోట్ల డ్రైన్ల నిర్మాణానికి ప్రతిపాదించారు. ఇప్పటికే ఉన్న ఐదు ఓవర్ హెడ్ ట్యాంకుల పునరుద్ధరణకు రూ.25 లక్షలు మంజూరయ్యాయి. క్లస్టర్ పరిధిలోని 31 హ్యాబిటేషన్లకూ తాగునీరు అందించడానికి రూ. 9.30 కోట్లతో తాగునీటి పథకానికి ప్రతిపాదనలు పంపించారు. మరోవైపు రూ.120 కోట్లతో హంద్రీనీవా కాలువ నుంచి కళ్యాణి డ్యామ్‌కు, మూలపల్లి చెరువుకు నీరందించే భారీ పథకాన్ని ప్రతిపాదించారు. ఈ నీటితో నారావారిపల్లె పరిధిలోని మొత్తం 1,104 ఎకరాలకు సాగునీరందించే ప్రయత్నం జరుగుతోంది.



### ఈ ఆటోతో రోజుకు వెయ్యి సంపాదిస్తున్నా

స్వర్ణ నారావారిపల్లె క్లస్టర్ పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఈ ఆటోను ప్రభుత్వం సబ్సిడీతో ఇచ్చింది. రూ.3.50 లక్షల విలువ గల ఈ ఆటో 1.50 లక్షలు రాయితీ ఇచ్చారు. దీంతో రోజుకు వెయ్యి రూపాయలు సంపాదిస్తున్నారు. సీఎం చంద్రబాబు వలన బతుకుతెరువు లభించింది.

- దూపాగు శివ, చిన్నరామాపురం గ్రామం

### దేశంలోనే మొదటి కామన్ వర్క్‌స్టేషన్: కలెక్టర్ వెంకటేశ్వర్

'నారావారిపల్లె క్లస్టర్‌లో సర్వే సందర్భంగా 48 మంది ఐటీ తదితర ప్రొఫెషనల్స్ వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్నారని గుర్తించాం. వీరందరికీ కామన్ వర్కింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నాం. ఇళ్ల నుంచి ఆ స్టేషన్‌కు వచ్చి పని చేసుకుని తిరిగి ఇళ్లకు వెళ్లేలా సదుపాయాలు కల్పిస్తాం. ఇంటర్నెట్, ఫర్నిచర్, కంప్యూటర్లు అందుబాటులో పెడతాం. అక్కడే కామన్ స్టడీ సెంటర్ కూడా పెడుతున్నాం. ఈ ప్రాంత ఇంటర్, డిగ్రీ విద్యార్థులు కాలేజీ నుంచి వచ్చాక కామన్ స్టడీ సెంటర్‌కు వచ్చి చదువుకునేలా లైబ్రరీ సహా అన్ని ఏర్పాట్లు చేస్తాం. దేశంలోనే ఈ తరహా ఏర్పాట్లు నారావారిపల్లెలోనే మొదటగా ఏర్పాటు చేయాలని సీఎం పట్టుదలతో ఉన్నారు.'

### స్వర్ణ నారావారిపల్లె సాకారానికి చర్యలు

'స్వర్ణ నారావారిపల్లె సాకారానికి ప్రభుత్వం రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు మంజూరు చేస్తోంది. ప్రతి ఇంటి నుంచీ ఇప్పటికే చెత్త సేకరణ జరుగుతోంది. ఏ ఇంటి చెత్తను ఆ ఇంట్లోనే ఎరువుగా మార్చేలా హోమ్ కంపోస్టింగ్ విధానం ప్రారంభిస్తున్నాం. అవసరమైన నిర్మాణాలను ఉపాధి హామీ నిధులతో చేపడతాం.'

-సుశీలాదేవి, నోడల్ ఆఫీసర్

### స్వయం ఉపాధి కల్పన గొప్ప అవకాశం



మహిళలకు స్వయం ఉపాధి కల్పనకు ఉచితంగా టైలరింగ్, మహిళలకు డ్రైవింగ్, ఎంబ్రాయిడరింగ్‌పై శిక్షణ ఇస్తున్నారు. సీఎం చంద్రబాబు ప్రతి ఒక్కరూ స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే తపన చాలా గొప్ప విషయం.

- మౌనిక, భీమవరం

### మా గ్రామాలకు గొప్ప వరం



మా గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం మూడు సచివాలయాల ప్రజలకు గొప్ప వరంగా భావిస్తున్నాం. సీఎం ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా అభివృద్ధి చెందుతామనే నమ్మకం ఉంది.

- కుసుమ, శేషాపురం

### కుటుంబ సభ్యుల్లా ప్రోత్సహిస్తున్నారు



ప్రభుత్వ అధికారులు మమ్మల్ని కుటుంబ సభ్యుల్లా ప్రోత్సహిస్తున్నారు. మేం అభివృద్ధి చెందాలని సాయశక్తులా కృషి చేస్తున్నారు. రోజూ మాతో మాట్లాడుతూ మనోధైర్యం ఇస్తున్నారు. సీఎం చంద్రబాబు ఆశయాలను నారావారిపల్లె క్లస్టర్ పరిధిలోని ప్రజలందరూ పాటిస్తే కచ్చితంగా అభివృద్ధి చెందుతాం.

- ప్రశాంతి, నారావారిపల్లె



### ప్రతి ఇంటికీ సౌర విద్యుత్

క్లస్టర్ పరిధిలో 2,007 ఇళ్లకు పైకప్పులపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడానికి అవకాశముందని సర్వేలో తేలింది. రూ.12.63 కోట్ల అంచనాతో అన్ని ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే 800 ఇళ్లపై ప్యానెల్స్ ఏర్పాటు చేశారు. అన్నీ ఏర్పాటు చేస్తే ఏటా రూ.4.86 కోట్ల విలువైన 57.74 లక్షల యూనిట్లు ఉత్పత్తి అవుతుందని అధికార యంత్రాంగం అంచనా వేస్తోంది.

### రంగంపేట స్కూలులో మద్రాసు ఐఐటీ పాఠాలు

ఎ.రంగంపేట జిల్లా పరిషత్ హైస్కూలుకు మహర్దశ పడుతోంది. సీఎం ఆసక్తితో ఈ స్కూలును శ్రీసిటీ యాజమాన్యం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చింది. 181 మంది చదువుతున్న ఈ బడిలో కృత్రిమ మేధ (ఏఐ), రోబోటిక్, సైన్స్, మ్యాథ్స్, ఇంగ్లీష్ ల్యాబ్‌లు ఏర్పాటు కానున్నాయి. ఫారిన్ లాంగ్వేజెస్ నేర్పించే ప్రతిపాదనలూ ఉన్నాయి. సీఎంవో, శ్రీసిటీల చొరవతో ఇప్పటికే మద్రాసు ఐఐటీ నిపుణులు 3 నెలలుగా ఇక్కడి 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఆన్‌లైన్ పాఠాలు చెబుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచీ జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతిభావంతులను గుర్తించి స్కూల్లో చేర్పిస్తారు. నారావారిపల్లె పరిధిలోని పది ప్రాథమిక పాఠశాలల్లో కూడా మౌలిక వసతులు కల్పించనున్నారు.

# చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

## నా కుమారుడు ఎవరినీ మోసం చేయలేదు

### పృథ్వీరాజ్ సుకుమారన్ తల్లి మల్లిక



'ఎల్2:ఎంపురాన్' చిత్రంలో కొన్ని సన్నివేశాలు వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఇప్పటికే దీనిపై చిత్ర కథానాయకుడు మోహన్‌లాల్ క్షమాపణలు చెప్పారు. తాజాగా చిత్ర దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ తల్లి మల్లిక స్పందించారు. తన కుమారుడు ఎవరినీ మోసం చేయలేదు అని ఆవేదన వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. "ఎల్2:ఎంపురాన్' తెర వెనుక ఏం జరిగిందో నాకు బాగా తెలుసు. పృథ్వీరాజ్ సుకుమారన్‌ను అన్యాయంగా నిందిస్తున్నారు. తప్పుడు కథనాలు రాస్తున్నారు. వాటిని చూసి ఓ తల్లిగా ఆవేదన చెందుతున్నా. మోహన్‌లాల్, చిత్ర నిర్మాతలు ఎవరూ తమను పృథ్వీరాజ్ మోసం చేశాడని చెప్పలేదు. ఇప్పుడు ఆయనకు, నిర్మాతలకు తెలియకుండా కొందరు నా కుమారుడిని బలిపశువును చేయడానికి ప్రయత్నిస్తున్నారు. అందరి ఆమోదంతోనే చిత్రం తెరకెక్కింది. కానీ సినిమా విడుదలయ్యాక పృథ్వీరాజ్ మాత్రమే జవాబుదారీ ఎలా అవుతాడు' అని ప్రశ్నించారు.

## సరికొత్త పాత్రలో...



వైవిధ్యమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు సుహాస్. ఆయన కథానాయకుడిగా మరో కొత్త చిత్రం పట్టాలెక్కనుంది. గోపీ ఆచార దర్శకత్వంలో బి.నరేంద్ర రెడ్డి నిర్మించనున్నారు. సోమవారం, ఈ చిత్రాన్ని ప్రకటించిన సందర్భంగా మేకర్స్ మాట్లాడుతూ "సినిమా పూర్తి వినోదాత్మకంగా ఉంటుంది. సుహాస్ పాత్ర చాలా కొత్తగా ఉండబోతోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. జూలై నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుంది. సినిమాకు సంబంధించిన ఇతర తారాగణాన్ని, సాంకేతిక సిబ్బందిని త్వరలోనే ప్రకటిస్తాం" అని తెలిపారు. ప్రస్తుతం 'ఓ భామా అయ్యోరామ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమయ్యారు సుహాస్.

## శ్రీరామ నవమి కానుకగా



రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'పెద్ది'. జాన్వీ కపూర్ కథానాయిక. వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్ సుకుమార్ రైటింగ్స్ నిర్మిస్తున్నాయి. ఇప్పటికే ఈ మూవీ నుంచి ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల చేసిన చిత్రబృందం తాజాగా గ్లింప్స్ రిలీజ్ డేట్‌పై అప్డేట్ ఇచ్చింది. శ్రీరామ నవమి కానుకగా ఫస్ట్ గ్లింప్స్‌ని ఈనెల 6న విడుదల చేస్తున్నట్లు దర్శకుడు బుచ్చిబాబు 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. ఈ చిత్రానికి ఏ.ఆర్.రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. కన్నడ నటుడు శివరాజ్ కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

## ఆకట్టుకునే ఓ తండ్రి కథ



దిగ్గజ గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తనయుడు ఎస్పీ చరణ్ కీలకపాత్రధారిగా తెరకెక్కిన చిత్రం 'లైఫ్'(లవ్ యువర్ ఫాదర్). పవన్ కేతరాజు దర్శకత్వంలో కిషోర్ రాఠీ, మహేశ్ రాఠీ, రామస్వామి రెడ్డి నిర్మించారు. శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా నటించారు. మణిశర్మ సంగీతం అందించారు. ఈనెల 4న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'చరణ్ సహకారం వల్ల సినిమా అద్భుతంగా వచ్చింది. ఈ సినిమాలో తండ్రి గొప్పదనాన్ని అద్భుతంగా ఆవిష్కరించే ప్రయత్నం చేశాం' అన్నారు. మన జీవితాలతో ముడిపడిన అంశాన్ని ఇతివృత్తంగా తీసుకొని తెరకెకించిన చిత్రం ఇదని చరణ్ చెప్పారు.

### కుటుంబ కథా చిత్రం



ప్రదీప్ మాచిరాజు, దీపికా పిల్లి జంటగా దర్శకద్వయం నితిన్-భరత్ తెరకెక్కించిన చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. ఈనెల 11న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ కుటుంబ కథా చిత్రాన్ని మాంక్స్ అండ్ మంకీస్ బ్యానర్ సంస్థ నిర్మిస్తోంది. ఈ సినిమా ట్రైలర్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో హీరో ప్రదీప్ మాట్లాడుతూ 'సినిమా ఆద్యంతం ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఉంటుంది. భవిష్యత్తులో మరిన్ని మంచి సినిమాలు చేయడానికి ఈ చిత్రం ఒక మెట్టు అవుతుందని భావిస్తున్నాం' అని అన్నారు. దర్శకులు నితిన్-భరత్ మాట్లాడుతూ 'సినిమా చాలా అద్భుతంగా వచ్చింది' అని చెప్పారు. హీరోయిన్ దీపిక మాట్లాడుతూ 'తన క్యారెక్టర్‌లో ఎన్నో ఎమోషన్స్ ఉంటాయి' అని తెలిపారు.

## అమ్మలందరికీ అంకితం

### కల్యాణ్‌రామ్



నరసరావుపేట పట్టణంలోని రవికళా మందిర్ థియేటర్‌లో సోమవారం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' చిత్రం నుంచి 'నాయాల్ది' అనే తొలిపాట విడుదల చేశారు. నందమూరి కళ్యాణ్‌రామ్, విజయశాంతి ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ కార్యక్రమంలో నందమూరి కళ్యాణ్‌రామ్ మాట్లాడుతూ ఈ చిత్రాన్ని అమ్మలకు అంకితం చేస్తున్నామన్నారు. ఉదయం నుంచి సాయంత్రం పడుకునే వరకు మన గురించి ఆలోచించే అమ్మలకు ఇచ్చే గౌవరంగా భావిస్తున్నామన్నారు. రాబోయే 20 సంవత్సరాల వరకు ఈ చిత్రం గుర్తుండిపోతుందన్నారు. దర్శకుడు చిలుకూరి ప్రదీప్ మాట్లాడుతూ ప్రేక్షకుల బావోద్వేగాలకు అనుగుణంగా తీర్చిదిద్దామన్నారు. చిత్రంలో పల్నాడు పౌరుషం కనిపిస్తుందని చెప్పారు. నందమూరి కళ్యాణ్‌రామ్‌కు స్థానిక ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు తనయుడు డాక్టర్ చదలవాడ ఆదిత్య కోటప్పకొండ త్రికోటేశ్వరుని చిత్ర పటం అందజేశారు. కార్యక్రమంలో నిర్మాత అశోక్‌వర్ధన్ ముప్పా తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేట టౌన్ (ఆంధ్రజ్యోతి)

## ఈ స్థాయి విజయం ఊహించలేదు

### కల్యాణ్ శంకర్



తన తొలి చిత్రం 'మ్యాడ్'తో దర్శకుడిగా సూపర్‌హిట్ అందుకున్నారు కల్యాణ్ శంకర్. ఈ చిత్రానికి కొనసాగింపుగా 'మ్యాడ్ స్క్వేర్'ను నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కించారు. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకాదరణతో భారీ హిట్ దిశగా దూసుకుపోతోంది. ఈ సందర్భంగా మీడియాతో ముచ్చటించారు దర్శకుడు కల్యాణ్. "మొదటి భాగం యువతకు ఎక్కువ చేరువైంది. కానీ రెండో భాగం యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులకూ చేరువవ్వడం ఆనందంగా ఉంది. సినిమాకు మంచి స్పందన వస్తుందని ఊహించాం. కానీ, ఈ స్థాయి విజయం అందుకుంటుందని అస్సలు ఊహించలేదు. ఈ సినిమాలో కథ ఉండదు.. కేవలం వినోదం మాత్రమే ఉంటుంది అని ప్రేక్షకులను ముందుగానే సిద్ధం చేయడం కలిసొచ్చింది. నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్‌నితిన్, విష్ణుల నటన, వినోదం, భీమ్స్ సిసిరోలియో సంగీతం, నిర్మాణ విలువలు ఈ సినిమాకు ప్రధానాకర్షణగా నిలిచాయి. ఈ విజయం ప్రేక్షకుల ప్రేమాభిమానాలకు అంకితం" అని చెప్పారు.

## మరింత చేరువవుతా

### వైష్ణవి చైతన్య



'బేబీ' ఫేమ్ వైష్ణవి చైతన్య ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారు. సిద్ధు జొన్నలగడ్డతో బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో ఆమె నటించిన 'జాక్' ఈ నెల 10న విడుదలవుతోంది. అలాగే, ఆనంద్ దేవరకొండతో ఓ చిత్రంలో నటిస్తున్నారు. తాజాగా, 'జాక్' సినిమా ప్రమోషన్స్‌లో మీడియాతో ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు ఆమె. "ఇప్పటివరకూ అన్నీ సీరియస్ పాత్రలే చేశాను. 'జాక్'లో డ్యూయల్ రోల్ పోషించాను. ఇందులో ఓ పాత్ర చాలా వినోదాత్మకంగా ఉంటుంది. ఈ చిత్రంతో కుటుంబ ప్రేక్షకులకు మరింత చేరువవుతాను" అని చెప్పారు.



## పూరి మార్క్‌తో

విభిన్నమైన.. విలక్షణమైన పాత్రలతో జాతీయ స్థాయిలో నటుడిగా మంచి పేరు తెచ్చుకున్నారు విజయ్ సేతుపతి. కొత్తదనం నిండిన కథలతో అలరించే దర్శకుడు పూరి జగన్నాథ్. ఇప్పుడు వీరిద్దరి కలయికలో ఓ చిత్రం రాబోతోంది. చిత్రబృందం ఈ విషయాన్ని ప్రకటించింది. 'ఈ సినిమా కోసం పూరి జగన్నాథ్ పవర్‌ఫుల్ కథను రాశారు. ఆయన తనదైన శైలిలో తెరకెక్కించనున్నారు. నటుడిగా విజయ్ సేతుపతిలోని కొత్త కోణాన్ని ఈ చిత్రం ఆవిష్కరిస్తుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. జూన్‌లో చిత్రీకరణ ప్రారంభిస్తాం' అని యూనిట్ తెలిపింది. చార్మీ కౌర్‌తో కలసి పూరి జగన్నాథ్ నిర్మిస్తున్నారు.

## ఉత్కంఠభరితంగా సాగే...



'అక్కడొకడుంటాడు' ఫేమ్ శివ కంఠంనేని, ఎస్తర్, ధన్య బాలకృష్ణన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న హారర్ థ్రిల్లర్ 'అమరావతికి ఆహ్వానం'. జీ.వి.కె దర్శకత్వంలో కె.ఎస్.శంకర్ రావు, ఆర్.వెంకటేశ్వర రావు నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా దర్శకుడు జీ.వి.కె మాట్లాడుతూ "ప్రస్తుతం హారర్ చిత్రాల ట్రెండ్ నడుస్తోంది. ప్రతీ క్షణం ఉత్కంఠభరితంగా సాగే ఈ సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ ప్రేక్షకులను తప్పక మెప్పిస్తుంది. హారర్ చిత్రాల్లో సరికొత్త ఒరవడిని సృష్టిస్తుంది" అని చెప్పారు.

## శక్తిమంతమైన పాత్రలో...



'బబుల్‌గమ్' ఫేమ్ రోషన్ కనకాల, సాక్షిసాగర్ మడోల్కర్ జంటగా నటిస్తున్న చిత్రం 'మోగ్లీ 2025'. సందీప్‌రాజ్ దర్శకత్వంలో పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో దర్శకుడు, నటుడు బండి సరోజ్‌కుమార్ 'క్రిస్టోఫర్ నోలన్' అనే ఓ శక్తిమంతమైన పాత్రను పోషిస్తున్నారు. తాజాగా, చిత్రంలో ఆయన పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటింగ్: కోదాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: రామమారుతి.ఎం, సంగీతం: కాలభైరవ.

# అడహాక్ ప్రమోషన్లపై దుమారం

◆ ఒక్కో పోస్టుకు రూ. 50 వేలు నుంచి రూ. లక్ష

గుంటూరు సిటీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ శాఖ అడహాక్ ప్రమోషన్లపై దుమారం చెలరేగింది. అర్హత లేని వారికి ప్రమోషన్లు ఇప్పించేందుకు తెర వెనుక సాగుతున్న ప్రయత్నాలు వివాదాస్పదంగా మారాయి. గత ప్రభుత్వ హయాంలో అత్యంత కీలకంగా వ్యవహరించిన ఉద్యోగుల ఆధ్వర్యంలో ప్రమోషన్ల పేరుతో నగదు వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలు హాట్ టాపిక్‌గా మారాయి. రాష్ట్రంలో 141 మంది అడహాక్ ప్రమోషన్లు పొందేందుకు ఫైల్ రూపొందించారు. మార్కెటింగ్ శాఖ ప్రధాన కార్యాలయంలో ఈ తంతును ముగించారు. అసిస్టెంట్ సెక్రెటరీలు 50 మంది, గ్రేడ్- 3 సెక్రటరీలు 39, గ్రేడ్-2 సెక్రెటరీలు 28 మంది, గ్రేడ్-1 సెక్రెటరీలు 13 మంది, స్పెషల్ గ్రేడ్ సెక్రటరీలు 11మంది, సెలక్షన్ గ్రేడ్ ఆరుగురు ప్రమోషన్లు పొందేందుకు వీలుగా ఫైల్ సిద్ధం చేశారు. జీఓ తీసుకువచ్చేందుకు మంతనాలు ఆరంభించారు. ఎవరైతే అడహాక్ ప్రమోషన్ల జాబితాలో ఉన్నారో వాళ్ల ఒక్కొక్కరు రూ. 50 వేలు నుంచి రూ.లక్ష వరకు చెల్లించాల్సి ఉంటుందని నిర్ణయించినట్లు తెలుస్తుంది. అందులో భాగంగా మొదటి విడతగా రూ. 30 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. మిగిలిన మొత్తం జీఓ వచ్చిన తరువాత అందజేసే విధంగా ఉద్యోగుల మధ్య ఒప్పందాలు కుదిరినట్టు చెబుతున్నారు. మొదటి విడత సొమ్మును వసూలు చేసేందుకు ప్రాంతాల వారీగా సెక్రెటరీలకు బాధ్యత అప్పగించినట్లు తెలుస్తోంది. కోస్తా ప్రాంతంలో మొదటి విడత మామూళ్ల సొమ్మును వసూలు చేసేందుకు ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ఇద్దరు సెక్రెటరీలను నియమించగా, రాయలసీమ ప్రాంతంలో వసూళ్లకు చిత్తూరుకు చెందిన మరో సెక్రెటరీకి బాధ్యతను అప్పగించినట్లు తెలిసింది. మొత్తం ఈ వ్యవహారంలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన కొందరు కీలక పాత్ర పోషిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వాస్తవానికి ప్రమోషన్లు పొందడానికి అర్హతలు లేనప్పటికీ దొడ్డిదారిన ఉన్నత పోస్టుల్లోకి రావడానికి సాగుతున్న అడహాక్ వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది.

## పీ4 విధానం నిరుపేద కుటుంబాలకు వరం: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఉగాది నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు పీ4 విధానానికి శ్రీకారం చుట్టడం రాష్ట్రంలోని పేద కుటుంబాలకు వరమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం పేర్కొన్నారు. ఇలాంటి వినూత్న పథకాలు, కార్యక్రమాలను ప్రజలకు అందించడంలో చంద్రబాబు తనకు తానే సాటిగా నిలుస్తారన్నారు. ఈ పథకం దేశానికే మార్గదర్శకంగా నిలవనుందని వివరించారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి సంపన్న వర్గాలు చేయూతనివ్వడమే పీ4 విధానమన్నారు. ఈ ప్రకటనతో వైసీపీలో వణుకు మొదలైందని, ఇది ఆచరణలోకి వచ్చి, పేదల జీవితాలు మారితే తమకు ఓట్లు రావన్నదే ఆ పార్టీ భయమన్నారు. 40 లక్షల కుటుంబాలను ప్రభుత్వం పీ4కు అర్హత కలిగినవిగా గుర్తించిందని, ప్రభుత్వం నేరుగా ఆయా కుటుంబాలతో అనుసంధానం కాకుండా, లబ్ధిదారులకు, సంపన్నవర్గాలకు మధ్య వారధిగా ఉండి పర్యవేక్షిస్తుందన్నారు. ఈ ప్రక్రియలో కుటుంబాలు, దాతలు ఎవరికి వారే స్వచ్ఛందంగా, మన స్ఫూర్తిగా పీ4లో భాగస్వాములై, తమ జీవితాలకు సార్థకత చేకూర్చుకోవచ్చునని తెలిపారు.







# పేరు పెట్టకముందే.. పైలోకాలకు...



లారీని ఢీకొన్న కారు

**వారసుడు పుట్టాడని ఆనందంగా దైవ దర్శనానికి బయలుదేరిన ఓ కుటుంబాన్ని మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురి ఉసురు తీసింది. మరో ఇద్దరిని తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలుజేసింది. ఈ హృదయ విదారక ఘటన అవనిగడ్డ మండలం పులిగడ్డ జాతీయ రహదారిపై సోమవారం జరిగింది.**

- తెనాలిలో పెను విషాదం
- పులిగడ్డ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి
- మృతుల్లో 20 రోజుల పసికందుతో సహా ఐదేళ్ల చిన్నారి కూడా
- మోపిదేవి ఆలయంలో నామకరణం కోసం వెళుతూ...
- ఒకే కుటుంబంలో నలుగురు మరణించడంతో విషాద ఛాయలు

తెనాలి, అవనిగడ్డ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : లేక లేక పుట్టిన 21 రోజుల పసికందుకు నామకరణం చేయించేందుకు బయలుదేరిన కుటుంబాన్ని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువు కబళించింది. మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి కొద్దిసేపట్లో చేరుతారగా లారీ రూపంలో మృత్యువు ముంచుకొచ్చింది. కారును ఢీ కొట్టిన ప్రమాదంలో తాత, నాయనమ్మతో సహా 21 రోజుల పసికందు అక్కడికక్కడే చనిపోతే, ఐదేళ్ల సోదరి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించడం ఆ కుటుంబంలోనే కాక తెనాలిలోనూ తీర్చలేని పెను విషాదాన్ని నింపింది. తెనాలి చెంచుపేటకు చెందిన గిడుగు రవీంద్రమోహనబాబుకు ఇద్దరు సంతానం. వారిలో కొడుకు కుటుంబంతో కలిసి అందరూ సోమవారం కృష్ణా జిల్లా మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి తెనాలి నుంచి బయలుదేరి వెళ్లారు. వెళ్లిన గంటలోనే పెను విషాదకరమైన వార్త వారి బంధువులను శోక సంద్రంలో ముంచింది. రవీంద్ర మోహనబాబు (55) తెనాలిలో ఎలక్ట్రికల్ కాంట్రాక్టరుగా పని చేస్తున్నారు. ఆయన గోదావరి జిల్లాకు చెందిన అరుణను (52) కులాంతర వివాహం చేసుకున్నారు. వారికి సందీప్ అనే కుమారుడు, మరొక కుమార్తె ఉంటే కుమారుడు గుంటూరులోని ఐటీసీలో ఉద్యోగిగా ఉన్నారు. ఈయన కూడా తెనాలికి చెందిన పల్లవి అనే ఆమెను కులాంతర వివాహమే చేసుకున్నాడు. వీరికి సాత్విక (5), అనే చిన్నారి ఉంటే వారి పెళ్లి తరువాత చాలా కాలానికి ఒక కుమారుడు జన్మించాడు. 21 రోజుల క్రితం పుట్టిన మనువడిని చూసి మురిసిపోయిన ఆ కుటుంబం సోమవారం మోపిదేవి వెళ్లి ఆలయంలో నామకరణం చేయించాలని నిర్ణయించుకుని కారులో బయలుదేరారు.

పులిగడ్డ - పెనుమూడి వారధి, టోల్ గేట్ల నడుమ కాకినాడ నుంచి పామాయిల్ లోడుతో ఎదురుగా వస్తున్న లారీని కారు రాంగ్ రూట్‌లో వెళ్లి ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ముందు సీటులో ఉన్న సందీప్ తండ్రి జి.ఆర్.మోహన్‌బాబు, వెనుక కూర్చున్న తల్లి అరుణ అక్కడికక్కడే మృతి చెందారు. వెనుక సీటులో ఉన్న సందీప్ భార్య పల్లవి, కుమార్తె సాత్విక, తల్లి ఒడిలో ఉన్న షణ్ముఖ్(2 నెలలు), డ్రైవింగ్ సీటులో ఉన్న సందీప్ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని కారుకు ఇరుక్కుపోయిన మోహన్‌బాబు, అరుణ మృతదేహాలను బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన సాత్విక, సందీప్, పల్లవిలను అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

### కారు సీటు వెనుక పసికందు

క్షతగాత్రులందరినీ ఆస్పత్రికి తరలించటం పూర్తయిందని భావించిన పోలీసులు ప్రమాద స్థలం నుంచి కారును వెనక్కి తీయగా, కారులో సీటు వెనుక పడిన రెండు నెలల పసికందు కనిపించింది. వెంటనే అప్రమత్తమైన అవనిగడ్డ సీఐ యువకుమార్, ఎస్ఐ శ్రీనివాస్ హుటాహుటిన అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి పసికందును తీసుకొచ్చారు. అయితే అప్పటికే ప్రమాదం జరిగి అరగంట కావడంతో పసికందును కాపాడేందుకు వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. తీవ్రంగా గాయపడిన స్వాతికకు రెండు సార్లు వైద్యులు సీపీఆర్ చేశారు. అయినా పరిస్థితి విషమంగా ఉండటంతో బెలూన్ ద్వారా ఆక్సిజన్ అందిస్తూ మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మార్గమధ్యలోనే సాత్విక మృతి చెందింది. సందీప్ భార్య పల్లవి తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆమెను, కాలు, పక్కటెముకలకు తీవ్ర గాయాలైన సందీప్‌ను కూడా మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

### నా వాళ్లు ఎక్కడ?

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సందీప్ షాక్‌లోకి వెళ్లిపోయాడు. కొద్దిసేపు తానెవరు, ఎక్కడి నుంచి వస్తుంది కూడా చెప్పలేకపోయిన సందీప్ కొద్దిసేపటి తర్వాత తాము గుంటూరు జిల్లా తెనాలి నుంచి వచ్చినట్లుగా పోలీసులకు తెలిపారు. నాకేమైంది.. ఇక్కడెందుకు ఉన్నాను.. నా వాళ్లు ఎక్కడ అంటూ సందీప్ పోలీసులను ప్రశ్నించారు. దీంతో పోలీసులు, వైద్య సిబ్బంది తల్లిదండ్రులు, కుమార్తె, కుమారుడు మరణించారని సమాధానం చెప్పలేక కంటతడి పెట్టుకున్నారు. సందీప్ ఫోన్‌కు తెలిసిన వారి నుంచి ఫోన్ రావడంతో వారు తెనాలి చెంచుపేటకు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. వెంటనే వారి బంధువులను అవనిగడ్డ రావాల్సిందిగా సూచించారు. మోహన్‌బాబు, అరుణ, షణ్ముఖ్ మృతదేహాలను అవనిగడ్డ మార్చురీకి తరలించగా, మచిలీపట్నం వెళ్తూ మార్గమధ్యలో మృతి చెందిన సాత్విక మృతదేహాన్ని మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.



రవీంద్రమోహనబాబు, భార్య అరుణ, మనుమరాలు సాత్విక, కుమారుడు సందీప్, కోడలు పల్లవి (ఫైల్‌ఫొటో)

చాలా సంవత్సరాల ఎదురు చూపు తరువాత మనువడు జన్మించడంతో కుటుంబమంతా సంతోషంగా ఉన్నారని, నామకరణం చేయించి వద్దామని బయలుదేరితే తిరిగి రాకుండానే మనుమడితో సహా కుటుంబాన్ని ఆ దేవుడు కూడా కరుణించకుండా తీసుకు పోయాడంటూ బంధువులు రోదిస్తున్నారు.

# ప్రయాణికులకు మెరుగైన సేవలు

- మంత్రులు సత్యకుమార్, అనగాని.
- రేపల్లె డిపోలో పదిబస్సులు ప్రారంభం

రేపల్లె, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలో ప్రయాణికుల కష్టాలను తీర్చేందుకు రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి ముందుకు వెళుతున్నారని వైద్యఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. సోమవారం రేపల్లె ఆర్టీసీ డిపోలో పది ఎక్స్‌ప్రెస్ బస్సులను మంత్రులు అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, నెల్లూరు జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ తీరప్రాంతంలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించే విధంగా ఈ బస్సులు ఉపయోగపడతాయన్నారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ రేపల్లె నుంచి తిరుపతికి రెండు బస్సు సర్వీస్‌లను ప్రారంభించామని తెలిపారు. 8 నూతన బస్సులు విజయవాడ,గుంటూరుకు వెళ్ళేవిధంగా ఏర్పాటు చేశామన్నారు. రేపల్లె ప్రజలు ఎన్నో ఏళ్ళుగా ఎదురుచూస్తున్న కోరిక నెరవేరిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రేపల్లె ఆర్టీసీ డిపోకు రెండు ఇంద్ర ఆర్టీసీ బస్సులను కూడా తీసుకువచ్చామన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళనారాయణ మాట్లాడుతూ నష్టాల్లో ఉన్న ఆర్టీసీని అభివృద్ధి వైపు నడిపించేలా కృషిచేస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా బ్యాటరీ బస్సులను తీసుకురావటం జరుగుతుందన్నారు. రానున్నరోజుల్లో మరిన్ని బస్సులను తీసుకువచ్చి రాష్ట్రంలో ఆర్టీసీని ఉన్నతస్థానంలో నిలబెట్టేందుకు కృషిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం సుఖవాసి సునీల్‌కుమార్, కృష్ణాపశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, టీడీపీ రాష్ట్రకార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, మేకా వెంకటశివరామకృష్ణ, జనసేనపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మత్తి భాస్కరరావు, బీజేపీ నాయకులు మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.



మంత్రులు అనగాని, సత్యకుమార్ యాదవ్‌లను గజమాలతో సన్మానిస్తున్న ఆర్టీసీ యాజమాన్యం, కార్మికులు

# వృషనాళాల్లో దిగిన ఆటో హ్యాండిల్

● ఆపరేషన్ చేసి తొలగించిన తెనాలి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు



తెనాలి రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఆటో హ్యాండిల్ వృషనాళాల్లోకి దిగి ప్రమాదకరంగా ఉన్న వ్యక్తికి తెనాలి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు జనరల్ అనస్థీషియాలో శస్త్రచికిత్స చేసి నిండుప్రాణాన్ని కాపాడారు. వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం తెనాలి సుల్తానాబాద్‌కు చెందిన ఆటో డ్రైవర్ టమ్మిశెట్టి దుర్గావర ప్రసాద్ (26) ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం తెనాలి నుంచి నందివెలుగు వెళుతూ ఎదురుగా ఉన్న వాహనాన్ని ఢీ కొట్టడంతో ఆటో హ్యాండిల్ రాడ్ అతడి వృష నాళాల నుంచి తొడ నరాల మధ్య గజ్జలోకి దిగింది. స్థానికులు హ్యాండిల్‌ను ఆటో నుంచి తొలగించి క్షతగాత్రుడిని తెనాలి ప్రభుత్వ వైద్యశాల అత్యవసర విభాగానికి తీసుకువచ్చారు. ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా రోగిని ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ హనుమంతరరావు, వెంకటేశ్వరరావు, అనస్థీషియా డాక్టర్ యశస్వి, డాక్టర్ తులసి నేతృత్వంలో వైద్యబృందం పరీక్షలు నిర్వహించి అనస్థీషియా ద్వారా శస్త్రచికిత్స చేసి హ్యాండిల్‌ను తొలగించారు.

## ఆటో అదుపుతప్పి డ్రైవర్ మృతి



మల్లిరాజు (ఫైల్)

మాచర్ల రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఆటో అదుపుతప్పి ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లడంతో ఆటో డ్రైవర్ మృతిచెందిన సంఘటన మండలంలోని అలుగురాజుపల్లిలో చోటుచేసుకుంది. మండలంలోని బీకేవీ చెంచుకాలనీకి చెందిన పోగుల పెద్ద మల్లిరాజు (35) ముఠా కూలీలను తీసుకొచ్చేందుకు తాటి అంజి అనే వ్యక్తితో కలిసి ఆటోలో అలుగురాజుపల్లి బయలుదేరాడు. అలుగురాజుపల్లిలోని డొంక రోడ్డులో వెళ్తుండగా ఆటో అదుపుతప్పి ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో మల్లిరాజు కిందపడడంతో తలకు రాయి బలంగా తగిలి తీవ్ర గాయంతో అక్కడికక్కడే మృతిచెందగా అంజి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ మహ్మద్ షఫి సంఘటనా ప్రాంతానికి చేరుకుని మల్లిరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్లలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఇద్దరు భార్యలు, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్టు

తాడేపల్లి టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి తాగుతూ, విక్రయిస్తున్న వ్యక్తుల గురించి సమాచారం అందుకున్న తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు సోమవారం ఎయిమ్స్ హాస్పిటల్‌కు వెళ్లే రోడ్డు వద్ద బ్రహ్మానందపురం పరిధిలో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మూడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వడ్డేశ్వరం రాధారంగా నగర్‌లో ఉంటున్న ముత్యాల మనోజ్‌కుమార్ అలియాస్ బన్ను, వడ్డేశ్వరంనకు చెందిన షేక్ అమీద్‌బాషా, కొలనుకొండకు చెందిన కైలా ప్రవీణ్‌లను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కల్యాణ్‌రాజు

### సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 519.70 అడుగులు ఉంది. ఇది 148.72 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 4050 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7110 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 13,260 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

## వీఆర్వో కోటయ్య మృతదేహం లభ్యం



ఆవుల కోటయ్య (ఫైల్)

పిడుగురాళ్ల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): బొల్లాపల్లి మండలం రేమిడిచర్ల వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న ఆవుల కోటయ్య (50) మృతదేహాన్ని సోమ వారం పిడుగురాళ్ల సమీపంలోని జూలకల్లు లాకుల వద్ద పిడుగురాళ్ల పోలీసులు గుర్తించారు. మృతుడు మార్చి 29న రేమిడిచర్ల నుంచి చిలకలూరిపేటలో నివాసముంటున్న చిన్న కొడుకు వద్దకు వెళ్లి వస్తానని చెప్పి అక్కడికి వెళ్ల కుండా కారంపూడి సమీపంలోని జూలకల్లు వద్ద వున్న సాగర్ కాలువ బ్రిడ్జిపై నిలబడి వీడియో కాల్ చేసి చనిపోతున్నట్లు మనవరాలికి చెప్పడంతో కుటుంబ సభ్యులు కారంపూడి నుంచి నాగార్జునసాగర్ కాల్వ వెంట వెతుకుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మనవరాలికి వీఆర్వో కోటయ్య వీడియో కాల్‌లో తనకు అప్పుల సమస్య వున్నట్లు చెప్పడంతో పాటు మృతుడు భార్య గాలమ్మ సోమవారం పిడుగురాళ్ల పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో అప్పుల బాధ వున్నట్లు తెలిపింది. సోమవారం ఉదయం 8 గంటల సమయంలో జూలకల్లు లాకుల వద్ద కోటయ్య మృతదేహం కుటుంబసభ్యులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మోహన్ తెలిపారు.

## నాలుగు పళ్ల విభాగంలో జేపంగులూరు ఎడ్లకు ప్రథమస్థానం

తెనాలి అర్బన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : తెనాలి మార్కెట్ యార్డులో జరుగుతున్న ఒంగోలు జాతి జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శనలో నాలుగు పళ్ల విభాగంలో బాపట్ల జిల్లా జేపంగులూరుకు చెందిన చిలుకూరి నాగేశ్వరరావు ఎడ్లజత ప్రథమ స్థానంలో నిలిచాయి. 15 నిమిషాల వ్యవధిలో ఈ ఎడ్లు 4260 అడుగుల దూరం బండ లాగాయి. కొల్లిపరకు చెందిన గుదిబండి శ్రీనివాసరెడ్డి ఎడ్ల జత 4200 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచాయి. సూర్యాపేట జిల్లాకు చెందిన గాదె సుందరమ్మ, పోతూరి ఆదినారాయణ గోపాల్ కంబైన్డ్ ఎడ్ల జత 3851 అడుగుల దూరం లాగి తృతీయ స్థానం సాధించాయి. కృష్ణా జిల్లా మల్లవల్లికి చెందిన రైతు అక్కినేని శాన్వి చౌదరి ఎడ్లు 3803 అడుగుల దూరం లాగి నాల్గో స్థానం, ప్రత్తిపాడు మండలం కొండెపాడుకు చెందిన రైతు చాగంటి శ్రీనివాసరావు ఎడ్లు 3616 అడుగుల దూరం లాగి ఐదో స్థానం, మంగళగిరి మండలం నవులూరుకు చెందిన రైతు బత్తుల శ్రీనివాసరావు ఎడ్లు 3409 అడుగుల దూరం లాగి ఆరో స్థానం, ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడుకు చెందిన రైతు గోపినాయుడు, సాంబశివరావుల కంబైన్డ్ ఎడ్లజత 3404 అడుగుల దూరం లాగి ఏడో స్థానం, ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడుకు చెందిన రైతు దర్శి సాత్విక్ ఎడ్లు 3075 అడుగుల దూరం లాగి ఎనిదో స్థానం, పల్నాడు జిల్లా కేసానుపల్లికి చెందిన రైతు శ్రీకావ్య రామకోటయ్య కంబైన్డ్ ఎడ్ల జత 3060 అడుగుల దూరం లాగి తొమ్మిదో స్థానంలో నిలిచాయి. ఈ విభాగంలో మొత్తం 15 జతలు పోటీ పడ్డాయి. విజేతలకు (వరుసగా ప్రథమ నుంచి తొమ్మిదో స్థానం వరకు) దాతలు కావూరి కృష్ణమోహన్ రూ.40 వేలు, కొత్తమాసు కుమార్ రూ.30 వేలు, కొత్తపల్లి రవీంద్రబాబు రూ.25 వేలు, కొల్లి నాగఫణీంద్రరెడ్డి రూ.20 వేలు, గోగినేని కృష్ణచైతన్య రూ.15 వేలు, సురేంద్రరాజు రూ.12 వేలు, వాసుదేవరావు రూ.10 వేలు, అబ్దుల్ రహీమ్ రూ.8 వేలు, కొడాలి ప్రభాకర్ రూ.6 వేలు అందించారు. పోటీల్లో పాల్గొన్న మిగిలిన జతలకు ప్రోత్సాహక నగదు బహుమతిగా రూ.5 వేలు అందజేశారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, టీడీపీ నాయకులు పోటీలను పర్యవేక్షించారు.



ప్రథమ స్థానంలో నిలిచిన జేపంగులూరు ఎడ్లజత



నాలుగు పళ్ల విభాగంలో పోటీపడుతున్న ప్రత్తిపాడు మండలం కొండెపాడుకు చెందిన రైతు చాగంటి శ్రీనివాసరావు ఎడ్ల జత

## బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్‌లో ఒకరు గల్లంతు

నకరికల్లు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్‌లో ఈతకు దిగి ఒకరు గల్లంతైన సంఘటన సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజుపాలెం మండలం పెద నెమలిపురి గ్రామానికి చెందిన ఐదుగురు స్నేహితులు ఈత కొట్టేందుకు శ్రీరాంపురం వద్ద గల బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్‌లో దిగారు. చిట్యాల హర్షతుల్లా(21)కి ఈత రాక పోవటంతో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో నీటిలో మునిగి కాలువలో కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు హర్షతుల్లా ఆచూకీ కోసం కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. హర్షతుల్లా ఆచూకీ లభించ లేదు.

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర**

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ (కిలో) | 145, 154, 165 |
| చికెన్ విత్ స్కిన్(కిలో) | 280.00 |
| చికెన్ స్కిన్ లెస్(కిలో) | 290.00 |

## ముస్లింలు నా కుటుంబసభ్యులు

● రంజాన్ వేడుకల్లో ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): అధికారం వున్నా.. లేకున్నా నేనెప్పుడూ గురజాల నియోజకవర్గంలో ముస్లిం సోదరులను నా కుటుంబసభ్యులనే భావిస్తానని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. రంజాన్ పండుగ సందర్భంగా పిడుగురాళ్లలోని యరపతినేనినగర్‌లో వున్న ఈద్గా వద్ద ముస్లింలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీలకు అతీతంగా ప్రతి ముస్లిం సోదరులు నా వెన్నంటి వున్నారని, వారికి ఏ కష్టమొచ్చినా నేనున్నాననే భరోసా కల్పిస్తున్నానన్నారు. మూడు ఎకరాల స్థలం కేటాయించి సుమారు రూ.40లక్షల సొంత నిధులతో అతిపెద్ద ఈద్గాను ఏర్పాటుచేసింది మీ పై వున్న అభిమానంతోనేనన్నారు. 50మందిని సొంత ఖర్చుతో ఒక్కొక్కరికి రూ.లక్ష ఇచ్చి హజ్ యాత్రకు పంపించానన్న తృప్తి నాకు మిగిలిందన్నారు. టీడీపీ హయాంలోనే ఈద్గాలు, మసీదుల నిర్మాణాలకు నిధులు కేటాయించడంతో పాటు మౌజన్, ఇమామ్‌లకు గౌరవ వేతనాన్ని ప్రభుత్వం కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. అనంతరం ఎమ్మెల్యే యరపతినేని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కొత్త చినసుబ్బారావు, ఖాజీ మౌలానా అబ్దుల్ కరీమ్, షేక్ బాబావలి, సయ్యద్ అమీర్‌అలి, టీడీపీ మస్తాన్‌వలి, భాష, కార్‌సైదా, ఫరీద్‌మేస్త్రీ, పెద్ద బుడే, ఖాదర్‌వలి, ముజీబ్, ఇర్షాద్, డాక్టర్ వలి, వాచర్ బుడే పాల్గొన్నారు.


యరపతినేని నగర్ ఈద్గా వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని

**మాచవరం మండలంలో..**

మాచవరం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం రంజాన్ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. తురకపాలెం, పిన్నెల్లి, మాచవరం, వేమవరం, గంగిరెడ్డిపాలెం, మోర్జంపాడు, పిల్లుట్ల తదితర గ్రామాల్లో ముస్లింలు రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. తెల్లవారుజాము నుంచే ఆయా గ్రామాల మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు.


మాచవరం: తురకపాలెంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

**దాచేపల్లి మండలంలో..**

దాచేపల్లి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలో ఘనంగా రంజాన్ పర్వదిన వేడుకలు నిర్వహించారు. దాచేపల్లి ఉన్నత పాఠశాలలో ఈద్గా వద్ద ప్రత్యేక నమాజ్ కార్యక్రమాలను నిర్వహించారు. ముస్లిం మతపెద్దలు మాట్లాడుతూ సాటి మనిషిపై మానవత్వాన్ని కలిగి ఉండాలన్నారు. దాచేపల్లి మండలంలోని ఈద్గాల్లో నమాజ్‌కు ముస్లింలు అధికసంఖ్యలో హాజరయ్యారు. మసీదులను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. దాచేపల్లి నగర పంచాయతీ కౌన్సిలర్ షరీఫ్, అంజుమన్ కమిటీ ప్రతినిధి ముస్తఫా మౌలానా తదితరులు ప్రజలకు ఈద్ ముబారక్ తెలిపారు.

## ముస్లింల సాధికారతే లక్ష్యం

ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

మాచర్లటౌన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పేద ముస్లింల స్వయం ఉపాధి, ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం పట్టణంలోని పాతూరులో ఈద్గా ప్రాంగణంలో వేలాదిమంది ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం రంజాన్ కానుకగా తన వంతుగా రూ.లక్ష అందించారు. మండలంలోని జమ్మలమడక, మండాది రోడ్డులోని ఎస్‌కేబీఆర్ కళాశాల వద్ద ఉన్న మసీద్ స్థలాలు అన్యాక్రాంతం అయ్యాయని ముస్లింలు ఎమ్మెల్యే దృష్టికితేగా సమస్య పరిష్కరిస్తానన్నారు. ఖబరస్తాన్ చుట్టూ ప్రహరీకి నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

**మాజీ కౌన్సిలర్ పాపమ్మను పరామర్శ**

పట్టణంలోని 23వ వార్డులో టీడీపీ నేత, మాజీ కౌన్సిలర్ వీర్ల పాపమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఎమ్మెల్యే జూలకంటి సోమవారం పాపమ్మను పరామర్శించారు. ఎమ్మెల్యే జూలకంటి వెంట టీడీపీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

**గురజాల మండలంలో...**

గురజాలటౌన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకన్నారు. పట్టణంలోని లక్ష్మీటాకీస్ సెంటర్లో ఈద్గా వద్దకు అధిక సంఖ్యలో ముస్లింలు చేరుకున్నారు. ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లిం పెద్దలు మాట్లాడుతూ ప్రేమ, సోదరభావం, శాంతికి చిహ్నమే రంజాన్ పర్వదినమన్నారు. ముస్లింలు తమ కుటుంబసభ్యులతో ఆహ్లాదకరమైన, ఆధ్యాత్మిక వాతావరణంలో రంజాన్ వేడుకలను జరుపుకున్నారు.


ప్రత్యేక ప్రార్థనలో ఎమ్మెల్యే జూలకంటి..

**వెల్దుర్తి మండలంలో...**

వెల్దుర్తి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిపార. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

**దుర్గి మండలంలో...**

దుర్గి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): దుర్గి మండలంలో సోమవారం రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముస్లింలు ఉదయాన్నే ఈద్గాకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మత పెద్దలు రంజాన్ పండుగ విశిష్టతను తెలిపారు. ముస్లింలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


రెంటచింతల: తుమ్మకోటలో నమాజ్‌లో పాల్గొన్న ముస్లింలు

**రెంటచింతల మండలంలో..**

రెంటచింతల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో సోమవారం రంజాన్ పండుగ ఘనంగా జరుపుకున్నారు. తుమ్మకోటలో 1667లో ఔరంగజేబుచే నిర్మితమైన ఆలంఘీర్ మసీదుతోపాటు మరో 11 మసీదుల్లో వేడుకలు జరిపారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని మత పెద్దలు ఆకాంక్షించారు.

**కారంపూడి మండలంలో...**

కారంపూడి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): కారంపూడి మండల పరిధిలో సోమవారం ముస్లింలు రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కారంపూడిలోని ముస్లింలు దాచేపల్లి రోడ్డు, ఆదినారాయణ కాలనీలోని ఈద్గాల వద్దకు చేరుకొని ప్రత్యేకప్రార్థనలు జరిపారు. మతపెద్దలు రంజాన్ విశిష్టతను వివరించారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ అధ్యక్షుడు షేక్ బడేసాహెబ్, ఉపాధ్యక్షుడు షేక్ మోదీన్సా తదితరులు పాల్గొన్నారు.

## మానవతా విలువలను తెలిపేదే రంజాన్

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్


ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మానవత విలువలను తెలిపేదే రంజాన్ పండుగ అని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. పెదకూరపాడులో సోమవారం రాత్రి టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ ముంతాజ్ గృహంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రవీణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ముస్లింలను ఎమ్మెల్యే ప్రవీణ్ ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలను తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, మండల పార్టీనేతలు భాష్యం ఆంజనేయులు, గల్లా బాబూరావు, సర్పంచ్ గుడిపూడి రాజు, ఏటుకూరి బ్రహ్మయ్య, మక్కెన సాగర్, నెల్లూరు మల్లిఖార్జున్, ఏటుకూరి గంగ, ఏటుకూరి రత్నకుమార్, డాక్టర్ గుడిపూడి చినరాజు, వడ్లమూడి కిషోర్, వడ్లమూడి అప్పారావు, అంద్రప్రసాదు, మద్దినేని వెంకటసత్యనారాయణ, భాష్యం జగదీష్, షేక్‌మస్తాన్ షరీఫ్, షేక్ రఫీ, షేక్ షబ్బీర్, షేక్ జానీ, షేక్ పర్వేజ్, షేక్ దిలీప్, షేక్ ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శాంతిమార్గం, పేదవారికి సాయం చేయటం అల్లా మనకు చూపిన మార్గమని, క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతన కలిగి ఉండటం రంజాన్ విశిష్టత అని ముస్లిం బోధకులు తెలిపారు. ఉదయం పెదకూరపాడు వీధుల్లో ముస్లింలు ర్యాలీగా జెడ్పీ హైస్కూల్ వద్ద ఈద్గా వద్దకు వెళ్ళి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

**అచ్చంపేట మండలంలో..**

అచ్చంపేట, మార్చి 31(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. సోమవారం రంజాన్ పర్వదినం సందర్భంగా సుమారు రెండువేల మంది ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మాదిపాడు, చల్లగరిక, చింతపల్లి, అచ్చంపేట, కొత్తపల్లి, కోనూరు, కస్తల, వేల్పూరు తదితర గ్రామాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

**అమరావతి మండలంలో..**

అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రంజాన్ పర్వదినాన్ని మండలంలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే స్థానిక ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. ఆయా ఈద్గాల వద్ద మౌలానాలు రంజాన్ సందేశాన్ని ఇచ్చారు. అనంతరం ఒకరికి ఒకరు రంజాన్ ముబారక్‌లు తెలుపుకున్నారు.

**క్రోసూరు మండలంలో..**

క్రోసూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను సోమవారం క్రోసూరు మండలంలో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా క్రోసూరులోని పోలీసుస్టేషన్ వద్ద ఈద్గా మైదానం, దొడ్లేరులో రోడ్డు పక్కన ఈద్గా వద్ద వందలాదిమంది ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. గుడిపాడులోనూ పెద్దసంఖ్యలో ప్రార్థనల్లో పాల్గొన్నారు. హసానాబాద్, ఊటుకూరు, క్రోసూరులలో ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు.

**బెల్లంకొండ మండలంలో..**

బెల్లంకొండ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు రంజాన్ వేడుకలను వైభవంగా నిర్వహించారు. బెల్లంకొండలోని రెండు ఈద్గాల వద్ద ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొన్నారు. వన్నాయపాలెం, పాపాయపాలెం, న్యూచిట్యాల ఆర్‌అండ్ఆర్ సెంటర్, నందిరాజుపాలెం గ్రామాల్లో రంజాన్ వేడుకలను నిర్వహించారు. మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు.


క్రోసూరు ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

## భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

సత్తెనపల్లి, మార్చి 31(ఆంధ్రజ్యోతి):రంజాన్ పండుగను పట్టణంలోని ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మాచర్ల రోడ్డులో ఈద్గా వద్ద ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గా వద్ద మునిసిపల్ అధికారులు ప్రత్యేకఏర్పాట్లుచేశారు.

● సత్తెనపల్లి రూరల్: రంజాన్ పండుగను మండలంలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో సోమవారం జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న మసీదుల్లో, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

**రాజుపాలెం మండలంలో...**

రాజుపాలెం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిగూడెం, మొక్కపాడు, ఆకులగణపవరం, ఇనిమెట్ల, అనుపాలెం తదితర గ్రామాలలో రంజాన్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. నెలరోజులపాటు వారు ఉపవాస దీక్షలు పూర్తి చేసుకున్నారు. అనంతరం ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతంంం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


రాజెపాలెం: రెడ్డిగూడెం ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

**ముప్పాళ్ల మండలంలో...**

ముప్పాళ్ళ మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్లింలు రంజాన్ పండుగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాల వద్ద నమాజ్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లింలు అధధికంగా ఉన్న ముప్పాళ్ళ మాదల, తొండపి, దమ్మాలపాడు గ్రామాలలో సందడి నెలకొంది. రంజాన్ సందర్భంగా ముప్పాళ్ళలో క్రికెట్ పోటీలను నిర్వహించారు. విజేతలకు నియోజకవర్గ టీడీపీ నాయకులు దరువూరి నాగేశ్వరరావు బహుమతులను అందజేశారు. 17 సంవత్సరాలుగా క్రికెట్ టోర్నమెంటు నిర్వహించడం పట్ల నిర్వాహకులు షేక్ మహబూబ్ సుభాని, షేక్ కొప్పరం జిలాని, పఠాన్ లీలావర్, మౌలాలిలను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ శింగరాజు సాయికృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, తురక పాలెం సర్పంచ్ చంద్రశేఖర్, గంగారాంఖాశిం, ఉగ్గం యలమందరావు తదితరులున్నారు.


ముప్పాళ్ళలో క్రికెట్ పోటీల విజేతలకు బహుమతిని అందజేస్తున్న నియోజకవర్గ టీడీపీ నాయకుడు దరువూరి నాగేశ్వరరావు

**నకరికల్లు మండలంలో...**

నకరికల్లు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పరస్పరం శుభాకాంక్షలు తెలియ జేసుకున్నారు. మసీదుల్లో, మైదానాల్లో ప్రార్థనలు నిర్వహించారు.

### అంబేడ్కర్ జాతీయ అవార్డుకు ఉపాధ్యాయుడు ఎంపిక

దాచేపల్లి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ ప్రతిభా అవార్డుకు దాచేపల్లి మండలం అలుగుమల్లిపాడు గ్రామానికి చెందిన మారం శ్రీరామమూర్తి ఎంపికయ్యారు. సోమవారం గుంటూరు చదరన్ ప్రైవేట్ లెక్చరర్ అండ్ టీచర్స్ ఆర్గనైజేషన్(ఎస్‌పీఎల్‌టీవో) ఎంపిక చేసింది. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఏప్రిల్ 13న గుంటూరు శ్రీవెంకటేశ్వర విజ్ఞానమందిరంలో అవార్డును అందుకోనున్నారు.

### నేటి నుంచి పిన్నెల్లికి బస్సు సౌకర్యం

పిడుగురాళ్ల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మాచవరం మండలం పిన్నెల్లి గ్రామానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చొరవతో మంగళవారం నుంచి పిడుగురాళ్ల డిపో ఆర్‌టీసీ బస్సు సౌకర్యాన్ని పునఃప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ రామకోటేశ్వరరావు తెలిపారు. పిడుగురాళ్ల నుంచి ప్రతి రోజు ఉదయం 9.45 గంటలకు, 11 గంటలకు, పిన్నెల్లి నుంచి 10.30 గంటలకు, 11.45 గంటలకు బస్సులు తిప్పనున్నట్లు మేనేజర్ తెలిపారు. గ్రామస్తులు ఆర్టీసీ బస్సును ఆదరిస్తే మరిన్ని బస్సులు నడుపుతామని మేనేజర్ తెలిపారు.

### అధ్యాపకుడి గృహంలో చోరీ

దాచేపల్లి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడు జీ బుల్లెయ్య గృహంలో దొంగలు బంగారాన్ని దోచుకున్నట్లు బాధితుడు సోమవారం తెలిపారు. పుల్లయ్య కళాశాలకు వెళ్ళగా ఆయన భార్య దాచేపల్లి నగర పంచాయతీలోని ఉన్నతపాఠశాలలో 10వ తరగతి పిల్లలకు ప్రత్యేక క్లాస్ చెప్పేందుకు ఇంటికి తాళం వేసి వెళ్ళారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి బీరువా తాళాలు తెరచి అందులోని బంగారాన్ని పట్టుకెళ్ళారు. బాధితుడు బుల్లెయ్య దాచేపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాలు పోలీసు దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

### కొవ్వొత్తులతో శాంతి ప్రదర్శన

సత్తెనపల్లి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని కోరుతూ సోమవారం రాత్రి పట్టణంలో సత్తెనపల్లి ప్రాంత సార్వత్రిక క్రైస్తవ సమాఖ్య, యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతి ప్రదర్శన జరిగింది. తాలూకా సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. అక్కడి నుంచి పలు వీధుల్లో ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనలో పాస్టర్లు, సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

## పింఛన్ల రీవెరిఫికేషన్


● అనర్హులు, బోగస్ పింఛన్‌ల ఏరివేత


సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో పరీక్షల కోసం వచ్చిన దివ్యాంగులు

సత్తెనపల్లి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ భరోసా పథకం కింద వృద్ధులకు, వికలాంగులకు ఇస్తున్న పింఛన్‌లపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల అర్హతపై రీవెరిఫికేషన్ చేయిస్తుంది. ఇందులో భాగంగా ఇప్పటికే మంచాలకే పరిమితమైన వ్యాధిగ్రస్తులపై విచారణ చేపట్టగా తాజాగా వికలాంగుల పింఛన్‌లపై జల్లెడ పడుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో బెడ్ రీడెన్ రోగులకు రూ.5వేలు ఇచ్చేది. దానిని కూటమి ప్రభుత్వం ఒకేసారి రూ.15వేలకు, వికలాంగులకు శాతాన్ని బట్టి రూ.6వేలు, వితంతు, ఇతరులకు ఇస్తున్న పింఛన్‌కు రూ.4వేలకు పెంచింది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెంపును అమలుచేస్తోంది. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల అర్హతను పరీక్షిస్తున్నది. రూ.6వేలు అందుకుంటున్న వికలాంగులపై కూడా మరోసారి సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో పరీక్షలు చేయిస్తున్నారు. డయాలసిస్ బాధితులు, వృద్ధులు, వికలాంగులు, మానసిక, శారీరక రోగులు, డప్పు కళాకారులు, చేనేత, ట్రాన్స్‌జెండర్, మత్స్యకారులు, రాజకీయ బాధితులు తదితర 23 రకాల పింఛన్‌లు ఉన్నాయి. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో దివ్యాంగుల అర్హత నిరూపణ పరీక్షలు జరుగుతున్నాయి. రోజుకు 50మందికి తక్కువ కాకుండా వైద్యులు పరీక్షిస్తున్నారు. గురజాల, మాచర్ల నియోజక వర్గాలకు చెందిన వృద్ధులు, దివ్యాంగులకు సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో పరీక్షలు జరుగుతున్నాయి. దివ్యాంగుల్లో వివిధ సమస్యలు ఉన్న బాధితులను గుర్తించి వార్డు, గ్రామ సచివాలయాల నుంచి నోటీసులు పంపుతున్నారు. పరీక్షకు హాజరుకావాల్సిన తేదీ, సమయం, ఆస్పత్రి పేరుతో జారీ చేస్తున్నారు. ఇప్పటికే నెల రోజులకు పైగా ఈ ప్రక్రియ జరుగుతుండగా వీరి అర్హత పరీక్ష పూర్తయ్యేందుకు మరో రెండునెలలు సమయం పడుతుందని అధికారుల అంచనా. పింఛన్ లబ్ధిదారుడు రేషన్, ఆధార్‌కార్డులతోపాటు గతంలో ఇచ్చిన సదరం సర్టిఫికెట్ తెచ్చి అర్హతను నిరూపించుకుంటున్నారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో వైద్యులు మరోసారి పరీక్షిస్తున్నారు. ఆయా వివరాలను వైద్యులు ప్రభుత్వానికి నివేదించనున్నారు. గత ప్రభుత్వంలో అనర్హులకు కూడా పింఛన్ మంజూరుచేయటంతో కూటమి ప్రభుత్వం అనర్హులు, బోగస్ పింఛన్‌లు ఏరివేసే క్రమంలో రీవెరిఫికేషన్ చేపట్టింది.

### ఉత్తమ పశువైద్యాధికారిగా బషీర్‌కు ఉగాది అవార్డు

రెంటచింతల, మార్చి 31 (ఆంధ్ర జ్యోతి): రెంటచింతల పశువైద్యాధికారి డాక్టర్ బషీర్ విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించినందుకు ఉగాది అవార్డుకు ఎంపిక చేస్తూ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ దామోదర నాయుడు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏప్రిల్ 2న విజయవాడలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో అవా ర్డును అందుకోనున్నారు.


రెంటచింతల పశువైద్య అధికారి బషీర్

### కేజీబీవీలో విద్యార్థినులకు అవగాహన

వెల్దుర్తి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వెల్దుర్తిలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు సోమవారం కెరీర్ గైడెన్స్, మెంటల్ హెల్త్‌పై సైకాలజిస్ట్ యూసఫ్ అవగాహన కల్పించారు. క్రమశిక్షణతో లక్ష్యం దిశగా అడుగులు వేస్తూ తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాభవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యుదుత్పత్తిలో లక్ష్యాన్ని అధిగమించిన టెయిల్ పాండ్ ప్రాజెక్టు

ఎస్ఈ వెంకటరమణ

రెంటచింతల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్‌ప్రాజెక్టులో 2025 మార్చి 31 ఆర్థిక సంవత్సరానికి విద్యుదుత్పత్తిలో లక్ష్యాన్ని అధిగమించినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ చెప్పారు. సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్చి 31నాటికి 78ఎంయుల(మిలియన్ యూనిట్లు) విద్యుత్‌ను తయారుచేయాల్సివుండగా 92.4279 ఎంయుల విద్యుత్ రెండు యూనిట్ల ద్వారా ఉత్పత్తైందన్నారు. సమావేశంలో జీఎం శ్రీనివాస్, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు, రత్తయ్య, మల్లేష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు

**ఉద్యోగులకు ఎమ్మెల్యే అభినందన**

విద్యుదుత్పత్తితో లక్ష్యాన్ని అధిగమించిన టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఉద్యోగులను ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి సోమవారం ఫోన్‌లో అభినందించినట్లు ఎస్ఈ చెప్పారు. రూ.100కోట్లతో చేపట్టబోయే సోలార్‌పవర్ ప్లాంట్ త్వరలో పట్టాలెక్కనున్నట్లు చెప్పారన్నారు.

### తుమ్మకోట ముస్లిం మైనార్టీల సమస్యలను పరిష్కరిస్తా

● ఎమ్మెల్యే జూలకంటి

రెంటచింతల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): తుమ్మకోటలో ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హామీనిచ్చారు. సోమవారం ఎమ్మెల్యేకి మండల ముస్లిం మైనార్టీ సంఘ అధ్యక్షులు జాన్‌మీరా వినతిని అందచేశారు. గ్రామంలో అర ఎకరంలో వున్న ఈద్గాకు ప్రహరీలేదని, షాదీఖానాకు మరమ్మతులు, మహిళలకు ప్రత్యేకంగా టాయ్‌లెట్స్ ఏర్పాటుచేయాలని, అలంఘీర్ మసీదును ఆధునీకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనార్టీ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నబీషా, అల్లాభక్షు తదితరులున్నారు.

### రేపు రుణమేళా

మాచర్లటౌన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మాచర్ల పురపాలక సంఘ పరిధిలో చంద్రన్న స్వయం ఉపాధి, బీసీ, ఈబీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అర్జీదారులకు ఈనెల 2వ తేదీన పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో రుణమేళా నిర్వహించనున్నట్లు కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న రుణమేళాకు పలు బ్యాంకు మేనేజర్లు హాజరవుతారన్నార. అర్జీదారులు రుణ అప్లికేషన్, ఆధార్, బ్యాంకు అకౌంట్ పాసుబుక్, పాన్‌కార్డ్, రేషన్‌కార్డులతో రుణమేళాకు హాజరు కావాలన్నారు.

### 3న మెగా జాబ్‌మేళా

మాచర్ల రూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాలలో ఈనెల 3వ తేదీన అమరరాజా కంపెనీ గ్రోత్ కారిడార్లో అపరేటర్లు, అప్రెంటిస్‌షిప్ ట్రైనీ ఉద్యోగాలకు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ విద్యార్హతతో పాటు 16 నుంచి 30 యేళ్లలోపు వారు అర్హులని నిర్వాహకులు తెలిపారు. వివరాలకు సెల్: 90000 06006, 95429 75992లను సంప్రదించాలన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

రెంటచింతల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మాడుగుల నుంచి మాచర్లకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న కాశిబోయిన పున్నారావును గోలివాగు సమీపంలో వెనుక నుంచి కారు ఢీకొనడంతో పున్నారావుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రాథమిక చికిత్స అనంతరం గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ నాగార్జున చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### సత్తెనపల్లి రూరల్ సీఐగా ఎంవీ సుబ్బారావు


ఎంవీ సుబ్బారావు

సత్తెనపల్లి రూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి రూరల్ సీఐగా ఎంవీ సుబ్బారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సత్తెనపల్లి రూరల్ సర్కిల్ సీఐగా పనిచేస్తూ బదిలీపై రూరల్ సీఐగా వచ్చారు. ఇప్పటివరకు రూరల్ సీఐగా పనిచేసిన పీ శ్రీనివాసరావు బదిలీ అయ్యారు.

### పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ-4 అమలు

పెదకూరపాడు, మార్చి 31(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ-4 రాష్ట్ర అభివృద్ధికి కీలకంగా నిలుస్తుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. నియోజకవర్గ క్యాంపు కార్యాయలంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ పీ-4 విధానం ద్వారా ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్న పదిమంది అట్టడుగు స్థాయిలో ఉన్న 20 శాతం మందిని పేదలను దత్తత తీసుకొని వారికి అన్నివిధాలుగా సహాయం చేయటం ద్వారా పేదరికాన్ని నిర్మూలించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో పేదరికాన్ని 2027 నాటికి పూర్తిగా నిర్మూలించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఉగాది సందర్భంగా పేదల అభివృద్ధి కోసం ప్రారంభించిన పీ-4 విధానం సీఎం చంద్రబాబు దార్శనికతకు నిదర్శనమన్నారు.

### కేజీబీవీలో ప్రవేశం కోసం దరఖాస్తుల ఆహ్వానం

క్రోసూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): క్రోసూరులోని కేజీబీవీ పాఠశాలలో 6, 11 తరగతుల్లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఇందిరా ప్రియదర్శిని సోమవారం కోరారు. 6వ తరగతిలో 40 సీట్లు, 11వ తరగతిలో 40 సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు కోరుతున్నట్టు తెలిపారు. దరఖాస్తు చేసుకోవటానికి ఏప్రిల్ 11వరకు గడువు ఉందన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, బడి మాని వేసినవారు, నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దారిద్ర్య రేఖకు దిగువ కుటుంబాలకు చెందిన బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవటానికి అర్హులన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే పరిగణలోకి తీసుకుంటామని ఆమె తెలిపారు.

### పులిచింతల సమాచారం

అచ్చంపేట, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 30.10 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా 300 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

### కారు ఢీకొని ఇరువురికి తీవ్రగాయాలు

బెల్లంకొండ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని ఇరువురు తీవ్రగాయాలపాలైన సంఘటన మండలంలోని చంద్రాజుపాలెం సమీపంలో మూడు మర్రిరెట్ల వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగింది. చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన మణికంఠ, మాచవరం గ్రామానికి చెందిన కిషోర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మణికంఠ, కిషోర్ ఇరువురు బెల్లంకొండ నుంచి చంద్రాజుపాలెం వెళ్తుండగా క్రోసూరు మండలం దొడ్లేరు గ్రామం నుంచి బెల్లంకొండ వస్తున్న కారు ఢీకుంది. క్షతగాత్రులను సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి ఈఎంటీ గోపీ, పైలెట్ నాగరాజు తరలించారు.

### 3న క్రెడిట్ క్యాంపు

నకరికల్లు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఈనెల 3వ తేదీ ఉదయం 10:30 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో క్రెడిట్ క్యాంపు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో జీ కాశయ్య తెలిపారు. స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకున్న బీసీ, ఈబీసీ కులాలకు చెందిన అభ్యర్థులు ఈ క్రెడిట్ క్యాంపుకు హాజరుకావాలన్నారు. వివిధ బ్యాంక్‌ల మేనేజర్లు ఈ సమావేశాలకు హాజరుకానున్నారని తెలిపారు.

# పల్నాడు వార్తలు

● నరసరావుపేట ● వినుకొండ ● చిలకలూరిపేట



## గుర్తు తెలియని వృద్ధుడి ఆత్మహత్య

నరసరావుపేట లీగల్, మార్చి 31, (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట రైల్వే పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని రైలు కిందపడి గుర్తుతెలియని వృద్ధుడు సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నరసరావుపేట రైల్వే ఎస్‌ఐ కథనం ప్రకారం శావల్యాపురం వినుకొండ రైల్వే స్టేషన్‌ మధ్య మార్కాపురం నుంచి రేపల్లెకు వెళుతున్న ఎక్స్‌ప్రెస్‌ కిందపడి 75 సంవత్సరాల వయసు గల వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు తెలుపు రంగు నిండు చేతుల చొక్కా, నీలం రంగు గడులు ఉన్న లుంగీ ధరించాడు. ఆచూకీ తెలిపినవారు నరసరావుపేట రైల్వే పోలీసులను గానీ, 9440438256కు గాని సమాచారం అందిచాలని నరసరావుపేట రైల్వే ఎస్‌ఐ తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో రంజాన్‌ ప్రార్థనలు



రొంపిచర్లలో ప్రార్థనలో జరిగిన పాల్గొన్న ముస్లింలు

నరసరావుపేట రూరల్‌, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్‌ పర్వదినం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. నరసరావుపేట మండలంలోని ములకలూరు, పమిడిపాడు, పెదతురకపాలెం, పెదతురకపాలెం, చిన్న తురకపాలెం, గ్రామాలలో ఘనంగా నిర్వహించారు.

● రొంపిచర్ల: మండలంలోని గ్రామాల్లో రంజాన్‌ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో సోమవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. దర్గాలు, ఈద్గాల వద్ద జరిగిన ప్రార్థనల్లో అధిక సంఖ్యలో హాజరయ్యారు. రొంపిచర్ల, మునమాక, విప్పర్ల, అలవాల, ఎడ్వర్డుపేట, సంతగుడిపాడు, గోగులపాడు గ్రామాల్లో మసీదులకు విద్యుత్‌ దీపాలంకరణ చేశారు.

● శావల్యాపురం: మండలంలోని కారుమంచి, గుంటుపాలెం, మతుకుమల్లి, శానంపూడి, శావల్యాపురం, కొత్తలూరు, పోట్లూరు, వేల్పూరు తదితర గ్రామాలలో రంజాన్‌ను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముస్లింలు మసీదులను విద్యుత్‌ దీపాలు, పూలమాలలతో అందంగా అలంకరించారు. ముస్లింలు నెలరోజుల నుంచి ఆచరించిన ఉపవాసాన్ని సోమవారంతో విరమించారు. వేకువజామునే ముస్లింలంతా నూతన వస్త్రాలు ధరించి మసీదులకు వెళ్ళి నమాజ్‌ను ఆచరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకొని రంజాన్‌ శుభాకాంక్షలను తెలుపుకొన్నారు. అనంతరం మసీదు కమిటీసభ్యులు



నాదెండ్లలో...

ముస్లింసోదరులకు, పేదలకు ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

● నాదెండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో రంజాన్‌ పర్వదినాన్ని ముస్లింలు సోమవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గణపవరం, నాదెండ్ల, తూబాడు, సాతులూరు, కనపర్రు, అప్పాపురం, గొరిజవోలు, చందవరం తదితర గ్రామాల్లోని ముస్లింలు ఈద్గాలు, పాఠశాలల ప్రాంగణాల్లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసుకున్న షామియానాల కింద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా మసీదులకు చెందిన మౌలానాలు రంజాన్‌ ప్రాముఖ్యతను వివరిస్తూ కష్టాల్లో ఉన్న వారికి ప్రతి ఒక్కరూ సాయం అందించాలని బోధించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

● చిలకలూరిపేట: రంజాన్‌ పండుగ సందర్భంగా సోమవారం పట్టణంలోని అడ్డరోడ్డు వద్ద ఉన్న ఈద్గా వద్ద వేలాదిమంది ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలో ఖబరస్థాన్‌ స్థల కొనుగోలుకు గానుఈ సందర్భంగా జ్ఞానేశ్వర్‌ ఫౌండేషన్‌ ఛైర్మన్‌ జాన్‌ సైదా రూ.10లక్షల చెక్కును అంజుమన్‌ కమిటీ అధ్యక్షుడు జాన్‌ పీరాకు అందచేశారు. ఈ సందర్భంగా జాన్‌సైదాకు అంజుమన్‌ కమిటీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

● యడ్లపాడు: రంజాన్‌ పండుగ సందర్భంగా ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో మసీదులు, ఈద్గా మైదానాలలో ప్రార్థనలు నిర్వహించారు. సామూహిక ప్రార్ధనల్లో పాల్గొనేందుకు ముస్లింలు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఈద్గాలు, మసీదులు కళకళలాడాయి. అనంతరం మత గురువులు ఖురాన్‌ పఠనం చేశారు. జాతి బేధం లేకుండా ప్రజలంతా ఐకమత్యంతో కలసిమెలసి ఉండాలని, ఈర్ష్యా, ద్వేషాలు ఉన్నచోట ప్రేమ, కరుణ



యడ్లపాడులో...

దూరమవుతాయని ఉద్బోధించారు. బోయపాలెం, యడ్లపాడు, కారుచోల గ్రామాలలోని ఈద్గాలవద్ద, వంకాయలపాడు, లింగారావుపాలెం, కోట, కొండవీడులలోని మసీదుల వద్ద సామూహిక ప్రార్థనలు నిర్వహించారు.

● బొల్లాపల్లి: మండలంలోని రామాపురం, బొల్లాపల్లి, రేమిడిచర్ల, గుమ్మనంపాడు, మేళ్ళవాగు తదితర గ్రామాల్లో రంజాన్‌ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మసీదుల వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని రంజాన్‌ పర్వదిన శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేద ముస్లింలకు దాన ధర్మాలు చేశారు. అనంతరం బంధువులతో ఇఫ్తార్‌ విందు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

● చీఫ్‌విప్‌ జీవీ ఆంజనేయులు

వినుకొండ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రంజాన్‌ పండుగను ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా తిమ్మాయపాలెం రోడ్డులోని ఈద్గా వద్ద ఏర్పాటుచేసిన సామూహిక ప్రార్థనల్లో ముస్లింలు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్‌విప్‌ జీవీ ఆంజనేయులుతో పాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి షమీమ్‌, మునిసిపల్‌ చైర్‌పర్సన్‌ డాక్టర్‌ దస్తగిరి, సీపీఐ సీనియర్‌ నాయకులు సంగ్రపాటి సైదాలు ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ తన విజయానికి మూడుసార్లుగా ముస్లిం సోదరులు అండగా నిలిచారని, వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నానన్నారు. స్థానిక ఈద్గా, మర్కస్‌ మసీదు అభివృద్ధికి రూ.40లక్షలు నిధులు కావాలని ముస్లిం సోదరులు గతంలో అడగడం జరిగిందని, వాటికి అవసరమైన నిధులను మునిసిపాలిటీ ద్వారా అందించేందుకు ఇప్పటికే తీర్మానం కూడా చేశామన్నారు. త్వరలో టెండర్లు పిలిచి ఈద్గా



ప్రార్థనలలో పాల్గొన్న చీఫ్‌ విప్‌ జీవీ, మక్కెన

ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని, ఈద్గా అభివృద్ధి కోసం ఖర్చును వ్యక్తిగతంగా ఇస్తానని, ఆ మేరకు సాయం చేస్తున్నానన్నారు. జీవీ ఆదేశాల మేరకు శివశక్తి ఫౌండేషన్‌ ద్వారా ఈద్గా వద్ద మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

## రంజాన్‌ సందర్భంగా పటిష్ట బందోబస్తు

నరసరావుపేట లీగల్‌, మార్చి 31, (ఆంధ్రజ్యోతి): రంజాన్‌ పండుగ సందర్భంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా పటిష్ట పోలీసు భద్రత ఏర్పాటు చేసినట్లు పల్నాడు జిల్లా పోలీస్‌ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మసీదుల వద్ద, ఈద్గాల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టారు.

## ప్రభలను సందర్శించిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

రొంపిచర్ల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల శంకరస్వామి తిరునాళ్ళ సందర్భంగా ఆదివారం రాత్రి ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే వేర్వేరుగా ప్రభలను సందర్శించారు. ఎమ్మెల్యే డాక్టర్‌ చదలవాడ అరవిందబాబు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్‌ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శంకర స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ప్రభల వద్దకు వెళ్లారు. ప్రభల నిర్వాహకులు, పార్టీ నాయకులు వారికి ఘన స్వాగతం పలికారు.

## రేషన్‌ డీలర్‌ మాణిక్యారావు మృతి

వినుకొండ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠంరాజుపల్లి గ్రామానికి చెందిన రేషన్‌షాపు డీలర్‌ మాణిక్యారావు అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతిచెందాడు. ఆయన విఠంరాజుపల్లి గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు చేయడంతో పాటు విద్యార్థులకు గణితం బోధిస్తూ మంచి గుర్తింపు సాధించారు. మాణిక్యారావు మృతిపై గ్రామస్థులు బంధువులు సంతాపం వ్యక్తం చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఈపూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒక వ్యకి గాయపడిన సంఘటన మండల కేంద్రమైన ఈపూరులో ఆదివారం రాత్రి జరిగింది. యర్రగుంట తండాకు వెళ్ళే రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న మోటార్‌బైక్‌, ఆటో ఢీకొన్నాయి. ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఎం.కొండలు తలకు గాయమైంది. క్షతగాత్రుడిని ఈపూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేశారు.

## ఆదిత్య బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు

చిలకలూరిపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓగేరు వాగు పక్కన ఉన్న ఆదిత్య బ్రాహ్మణ సంఘం భవనంలో ఉగాది వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన తూబాటి లక్ష్మీనారాయణ కళావేదికను ప్రారంభించారు. ప్రముఖ కళాకారులు, రేడియో, దూరదర్శన్‌ కళాకారులు భాగి కృష్ణమూర్తి, భరతనాట్య, కూచిపూడి నృత్య కళాకారిణి గాలి రేవతిదేవిలను ఉగాది పురస్కారాలతో ఘనంగా సన్మానించారు. గబ్బిటి వెంకటేశ్వర శాస్త్రి ఉగాది పంచాంగ పఠనం చేశారు. సంఘ అధ్యక్షుడు ఏక మారుతి రామ శర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా చిలకలూరిపేట మున్సిపల్‌ ఆర్వో పొత్తూరి సుబ్బారావు, సంఘ గౌరవాధ్యక్షుడు చల్లా విజయకుమార్‌, కార్యదర్శి పోలూరు చంద్రమౌళి, పావులూరు శేష గిరిరావు, ధూళిపాళ్ల శ్రీకాంత్‌ పాల్గొన్నారు.

# వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలతో నిరసన



ప్రభుత్వ చీఫ్‌విప్‌ జీవీకి వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం పెద్దలు

వినుకొండ టౌన్‌, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రంజాన్‌ పండును పురస్కరించుకొని ఈద్గా వద్ద పెద్దసంఖ్యలో పాల్గొన్న ముస్లిం సోదరులు వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు ప్రభుత్వ చీఫ్‌విప్‌ జీవీ ఆంజనేయులును కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం జీవీ మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని, ఎంపీ కృష్ణదేవరాయలు ద్వారా కేంద్రానికి కూడా తెలియజేస్తామని ముస్లిం మతపెద్దలకు హామీ ఇచ్చారు.

### చిలకలూరిపేటలో నిరసన

చిలకలూరిపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌ బోర్డు చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా సోమవారం చిలకలూరిపేట నియోజకవర్గ వ్యాప్తంగా ఈద్గాల వద్ద ముస్లింలు నల్ల బ్యాడ్జీలతో శాంతియుతంగా నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ ఈ సవరణలు ముస్లింలను మాత్రమే కాకుండా ఇతర మైనారిటీ వర్గాలను కూడా ప్రభావితం చేస్తాయన్నారు. ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించి కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. వక్ఫ్‌ బోర్డు గతంలో వక్ఫ్‌ సవరణ బిల్లు 2024ను వ్యతిరేకించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు, ముస్లిం మైనార్టీలు పాల్గొన్నారు.

### యడ్లపాడులో...

యడ్లపాడు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు సవరణ చట్టం-2024ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ ముస్లింలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. రంజాన్‌ పర్వదినాన్ని పురస్కరించుకుని మసీదులు, ఈద్గాల వద్ద జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు వివిధ రూపాల్లో తమ నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని వంకాయలపాడులో ముస్లింలు నల్లని బ్యాడ్జీలు ధరించి ప్రార్థనల్లో పాల్గొన్నారు. కొండవీడులోని హజరత్‌ సయ్యద్‌ ఖుదాదే పాకీర్ష చౌదరి దర్గా వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు, ముజావర్లు తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ వక్ఫ్‌ బోర్డు చట్టం-1995 కు సవరణ చేసి మతాల మధ్య చిచ్చుపెట్టాలని కేంద్రం చూస్తున్నదని విమర్శించారు. వక్ఫ్‌ బోర్డు ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవాలన్న దురుద్దేశంతోనే కేంద్రం ఈ చట్టాన్ని తెస్తున్నదని ఆరోపించారు. కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న ఈ బిల్లును దేశంలోని అన్ని రాజకీయ పార్టీలన్నీ కలసి వ్యతిరేకించాలని కోరారు. ఆయా నిరసన కార్యక్రమాల్లో దర్గా కమిటీ సెక్రటరీ సయ్యద్‌ షాహిన్షా, సయ్యద్‌ వహీద్‌, సయ్యద్‌ జమాల్‌, సయ్యద్‌ హసన్‌, సయ్యద్‌ సనావుల్లా, సయ్యద్‌ జహంగీర్‌, బుడే తదితరులు పాల్గొన్నారు.



జొన్నలగడ్డ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన కళావేదిక, కార్యక్రమంలో పాల్గొన్న దాతలు

## జొన్నలగడ్డ జడ్పీహెచ్‌ఎస్‌లో కళావేదిక ఏర్పాటు

నరసరావుపేట రూరల్‌, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నలగడ్డ గ్రామానికి చెందిన దివంగత ప్రముఖ న్యాయవాది నల్లపాటి వెంకటేశ్వర్లు చౌదరి సతీమణి నల్లపాటి రామతారకం 99వ జన్మదిన సందర్భంగా గ్రామంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో కళావేదికను ఏర్పాటు చేశారు. సోమవారం కళాశాల ఆవరణలో నల్లపాటి రామతారకం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన భారీ కేకును నల్లపాటి రామతారకం కట్‌చేసి విద్యార్థులకు అందజేశారు. పాఠశాల ఆవరణంలో నూతనంగా నిర్మించిన కళావేదికను ప్రముఖ న్యాయవాది నల్లపాటి లక్ష్మీనారాయణ, జీడీసీసీ బ్యాంకు చైర్మన్‌ నల్లపాటి చంద్రశేఖరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం మైనంపాడులోని నైస్‌ అనాథ పాఠశాల విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు.

## నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్‌ స్తంభాలు

● నవోదయ మైత్రి సొసైటీ అధ్యక్షుడు ప్రసాద్‌ ఆరోపణ

వినుకొండ టౌన్‌, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాలలపాలెం సమీపంలోని జగనన్న కాలనీలో విద్యుత్‌ స్తంభాల ఏర్పాటులో అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నట్లు నవోదయ మైత్రి సొసైటీ అధ్యక్షుడు కూకట్లపల్లి ప్రసాద్‌ తెలిపారు. ఈ సందర్భంగా జగనన్న కాలనీలోని ఏర్పాటుచేసిన విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు విద్యుత్‌ స్తంభాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారంపూడి రోడ్డును కలుపుతూ పూర్వం నుంచి ఒక అప్రోచ్‌ రోడ్డు పంచాయతీరాజ్‌ శాఖ వారితో నోటిపై చేయబడిన రోడ్డుకు బదులు వెంకుపాలెం జగనన్న కాలనీకి అప్రోచ్‌ రోడ్డు అనే పేరుతో డొంక రోడ్డును సృష్టించి భారీ అవకతవకలకు పాల్పడినట్లు ఆయన ఆరోపించారు. కాలనీలో నిబంధనలను అతిక్రమించి 60 మీటర్ల దూరంలో వేయాల్సిన విద్యుత్‌ స్తంభాన్ని 30మీటర్ల చొప్పున ఏర్పాటుచేసి అధిక మొత్తంలో కమిషన్లు దండుకోవడం జరిగిందన్నారు. జగనన్న కాలనీలో అధిక భాగం భూమి చౌడు కలిగిఉండటంతో గతంలో ఏర్పాటుచేసిన విద్యుత్‌ స్తంభాలు పడిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయని, రాబోయే రోజుల్లో గాలివానకు విద్యుత్‌ స్తంభాల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మిగులు విద్యుత్‌ స్తంభాలతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లను పట్టణంలో నిరుపేదలు నివాసం ఉండే ప్రాంతానికి తరలించి ఆదుకోవాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పిడుగు విజయ్‌కుమార్‌, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, ప్రసాదరావు, అశోక్‌చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



విరిచేసిన తెలుగుదేశం పార్టీ జెండా కర్ర

## తెలుగుదేశం పార్టీ జెండా తొలగింపు, దాడి

● శృంగారపువనంలో వైసీపీ సానుభూతిపరుల దుశ్చర్య

వినుకొండ టౌన్‌ మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జెండాను తొలగించి, జెండా ఏర్పాటు చేసిన ఇంటి యజమానిపై వైసీపీ సానుభూతి పరులు దాడి చేసిన సంఘటన పట్టణంలోని శృంగారపువనంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని శృంగారపువనంలోని బత్తుల శ్రీనివాసరావు ఇంటి ఆవరణలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 29 తేదీన పార్టీ జెండాను ఆవిష్కరించారు. జెండా పండుగను చూసి తట్టుకోలేని కొందరు వైసీపీ సానుభూతిపరులు ముందస్తు ప్రణాళికలతో సోమవారం రాత్రి డీజే ఏర్పాటుచేసి, నూతనంగా వైసీపీ జెండాను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా పక్కనే ఉన్న తెలుగుదేశం పార్టీ జెండాను తొలగించడంతో పాటు, పార్టీ జెండాకు అనుమతించిన ఇంటి యజమాని శ్రీనివాసరావుపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చారు. జరిగిన సంఘటనపై తెలుగుదేశం పార్టీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. మొత్తం ఐదుగురుపై కేసు నమోదు చేసినట్లు సీఐ శోభన్‌బాబు తెలిపారు.



కర్ర సాము, కత్తి సాము ప్రదర్శనలో పాల్గొన్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌

## వైభవంగా కావమ్మ, మారయ్య స్వామివార్ల తిరునాళ్ళ

చిలకలూరిపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బెస్తపాలెంలో సుమారు 300 సంవత్సరాల చరిత్ర కలిగిన కావమ్మ తల్లి, మారయ్య స్వామి వార్ల దేవాలయం వద్ద ఆదివారం రాత్రి తిరునాళ్ళ మహోత్సవం వైభవంగా జరిగింది. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌ కావమ్మ తల్లి, మారయ్య స్వామివార్లకు ప్రత్యేక పూజలు జరిపి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అక్కడి ఆచారం మేరకు ఆలయ ధర్మకర్త సాప వీరరాఘవులు బృందం కర్రసాము, కత్తిసాము ప్రదర్శన చేసి అందరినీ ఆకట్టుకున్నారు. భక్తుల కోర్కె మేరకు ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌ సరదాగా కర్రసాము, కత్తిసాములో పాల్గొని ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తోట రాజారమేష్‌, నవతరం పార్టీ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం, చిలకలూరిపేట బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు సాప ఆదినారాయణ, అడ్వకేట్‌ తోట శ్రీనివాసరావు, మల్లెల నాగేశ్వరరావు, సాప లక్ష్మీనారాయణ, ఇమ్మడి సురేంద్ర పాల్గొన్నారు.



కల్యాణ్‌రామ్‌కు చిత్రపటాన్ని అందజేస్తున్న డాక్టర్‌ లలిత్‌సాగర్‌, లక్ష్మి దంపతులు, డాక్టర్‌ వెంకటేశ్వరరావు తదితరులు, చావ వెంకటేష్‌ కుటుంబంతో కల్యాణ్‌ రామ్‌

## నరసరావుపేటలో కళ్యాణ్‌ రామ్‌ సందడి

నరసరావుపేట టౌన్‌, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నందమూరి హరికృష్ణ తనయుడు, సినీ నటుడు నందమూరి కళ్యాణ్‌రామ్‌ నరసరావుపేటలో సందడి చేశారు. రవికళా మందిర్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చి టీడీపీ యువనేత డాక్టర్‌ కడియాల లలిత్‌సాగర్‌, టీడీపీ దర్శి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి గృహాన్ని సోమవారం సందర్శించారు. నరసరావుపేటకు చెందిన పలువురు వైద్యులు, నందమూరి, కడియాల అభిమానులు కల్యాణ్‌రామ్‌తో ఫొటోలు దిగారు. వారితో టీడీపీ డాక్టర్‌ సెల్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్‌ కడియాల వెంకటేశ్వరరావు, కడియాల రమేష్‌బాబు, తదితరులు ఆయన వెంట ఉన్నారు.

### కేఎం అగ్రహారంలో....

నరసరావుపేట మండలం కేఎం అగ్రహారంలో నందమూరి కళ్యాన్‌రామ్‌ సోమవారం పర్యటించారు. తన మేకప్‌మేన్‌గా పనిచేస్తున్న చావా వెంకటేష్‌ గృహాన్ని ఆయన సందర్శించారు. కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలుకరించారు. ఆకస్మికంగా కల్యాణ్‌రామ్‌ రావటంతో కేఎంఅగ్రహారంలో సందడి నెలకొంది.

## అగ్ని ప్రమాద బాధితులకు శివశక్తి చేయూత



బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు అందజేస్తున్న గోనుగుంట్ల లీలావతి

వినుకొండ టౌన్‌, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బొల్లాపల్లి మండలం గరికపాడు, వినుకొండ మండలం పెదకంచర్ల గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలకు శివశక్తి ఫౌండేషన్‌ చైర్మన్‌ గోనుగుంట్ల లీలావతి చేతుల మీదుగా సోమవారం ఆర్థిక సాయం అందజేశాఉ. పెదకంచర్ల గ్రామానికిచెందిన ఒంటేరు బాలకోటేశ్వరరావు కుటుంబం, గరికపాడుకు చెందిన కొక్కెర వీరాంజనేయులు కుటుంబాలకు ఆర్థికసాయంతో పాటు వంటసామాగ్రి, దుస్తులు, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జునరావు, మాదాల చిరంజీవి, రామినేని ఆంజనేయులు, ముత్తినేని హనుమంతరావు, దొడ్డ నాగరాజు, ముక్కంటి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## చెన్నైలో వేమన మహేష్‌కు సత్కారం



వేమన మహేష్‌ను సత్కరిస్తున్న ఆర్‌ఎస్‌ జీవరత్నం, భోజనాల నాగరాజుగుప్తా తదితరులు

నరసరావుపేట టౌన్‌, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటకు చెందిన దర్శి ఎస్‌ మహేశ్వరరావు వేమన మహేష్‌గా పల్నాడు జిల్లాలో సుపరిచితమే. అలవోకగా, భావయుక్తంగా వేమన పద్యాలు ఆలపించి వివరిస్తారు. ఈ నేపథ్యంలో చెన్నైలోని కొరట్టూరు అగ్రహారంలో తెలుగు సాంస్కృతిక సంస్థ శ్రీ ఆంధ్ర కళాస్రవంతి ఆధ్వర్యంలో శ్రీవిశ్వావసు నామ సంవత్సరం ఉగాది సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్‌.మహేశ్వరరావును ఆహ్వానించడంతో అక్కడ వేమన పద్యాలు ఆలపించి అలరించారు. ఈ సందర్భంగా వేమన మహేష్‌ను ముఖ్యఅతిథులు ఆర్‌ఎస్‌ జీవరత్నం, భోజనాల నాగరాజుగుప్తా సత్కరించారు. వేమన మహేష్‌ కేవలం ఉన్నత పాఠశాల విద్యను మాత్రమే అభ్యసించారు. కానీ వేమన సాహిత్యంపై ఎస్‌.మహేశ్వరరావుకు ఉన్న మక్కువతో వేమన పద్యాలు ఆలపించి ఆకట్టుకుంటూ దేశంలో పలుచోట్ల ప్రదర్శనలు ఇస్తూ పలువురి ప్రశంసలు పొందుతున్నారు.

## అష్టలక్ష్మీ దేవాలయానికి కుర్చీల వితరణ



కుర్చీలు వితరణగా అందిస్తున్న దాతలు

నరసరావుపేట టౌన్‌, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఎన్‌జీవో కాలనీలోని అష్టలక్ష్మీ దేవాలయానికి సోమవారం 20 కుర్చీలు అందజేశారు. కాలనీకి చెందిన అర్వపల్లి శేఖర్‌, నాగఅరుణ కుమారుడు దీరజ్‌ మురుగన్‌ సాయి ఈ కుర్చీలను అందజేశారు.

## యువతకు స్ఫూర్తి ఓఎస్డీ కృష్ణతేజ



కృష్ణతేజకు అభినందనలు తెలుపుతున్న చరణ్‌ తేజ

చిలకలూరిపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): యువతకు స్ఫూర్తి ఓఎస్డీ మైలవరపు కృష్ణతేజ అని జనసేన నాయకుడు చరణ్‌తేజ ప్రశంసించారు. డిప్యూటీ సీఎం పవన్‌ కళ్యాణ్‌ ఓఎస్డీ మైలవరపు కృష్ణతేజను జనసేన పార్టీ నాయకుడు మండలనేని చరణ్‌తేజ ఆదివారం కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధికి కొత్త పథకాలు రూపకల్పనకు ఆయన చేస్తున్న కృషిని ప్రశంసించారు. కృష్ణతేజ ప్రభుత్వం దృష్టిలో సమర్థవంతమైన అధికారి మాత్రమే నని, కేరళ ప్రజల దృష్టిలో వారి జీవితాల్లో వెలుగులు నింపిన ఆపద్బాంధుడు అని కొనియాడారు. భావితరం భవిష్యత్తు కోసం, వారిలో మార్పుకోసం అనుక్షణం శ్రమిస్తున్న కృష్ణతేజ యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు.

## పెరిగిన అడవి పేరంటాలమ్మ హుండీ ఆదాయం

బొందిలిపాలెం (శావల్యాపురం) మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శానంపూడి శివారు బొందిలిపాలెంలోని అడవి పేరంటాలమ్మ తిరునాళ్ళ సందర్భంగా గతంలో కంటే హుండీ ఆదాయం పెరిగినట్లు ఈవో సుధాకర్‌ రెడ్డి తెలిపారు.

తిరునాళ్ళ సందర్భంగా దేవాలయానికి మొత్తం రూ.6,37,158 ఆదాయం వచ్చిందని, గతేడాది కంటే రూ.2,19,726 అదనంగా ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. కొబ్బరికాయల వేలానికి రూ.67 వేలు, కొబ్బరిచిప్పల వేలానికి రూ.36వేలు, ప్రసాదాల వేలానికి రూ.33,500, భక్తుల విరాళాలు రూ.2,90,741, హుండీ ఆదాయం రూ.1,91,587, చీరెల వేలానికి రూ.18,330లు చొప్పున ఆదాయం వచ్చినట్లు తెలిపారు.